

కర్నూలు బస్సు ప్రమాదం బాధాకరం. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఘటనపై విచారణ జరుగుతోంది. ట్రావెల్స్ బస్సుల యజమానులు సదా భద్రతా నిబంధనలు పాటించాలి, ప్రజల రక్షణ ప్రాముఖ్యం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శనివారం 25.10.2025

INK OF TRUTH


# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 188 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


## ఏపీలో వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ లక్ష్యంగా విప్లవాత్మక సంస్కరణలు

- విద్యార్థులను భవిష్యత్ నైపుణ్యాలకు సిద్ధం చేసేందుకు లీప్ విధానం
- మెల్‌బోర్న్ ఎడ్యుకేషన్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్



**ఆస్ట్రేలియా (మెల్ బోర్న్):** ఆంధ్రప్రదేశ్ లో 2029 నాటికి ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థను తయారుచేయడమే లక్ష్యంగా పలు విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్టిమెంట్ కమిషన్ ఆధ్వర్యాన మెల్‌బోర్న్ లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ రౌండ్ టేబుల్ సమావేశానికి మంత్రి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో స్టడీ మెల్‌బోర్న్, విక్టోరియన్ ఎడ్యుకేషన్, స్కిల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేస్తున్నాం. మేం అమలు చేస్తున్న లీప్ కార్యక్రమం విద్యారంగంలో కొత్త తరానికి మార్గదర్శకత్వం వహిస్తోంది. అంతర్జాతీయస్థాయి ఉత్తమ బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషిచేస్తున్నాం.

21వ శతాబ్దపు నైపుణ్యాలకు విద్యార్థులను సన్నద్ధం చేయడమే మా లక్ష్యం. సాంప్రదాయ విధానాలకు స్వస్తి చెబుతూ... ఆట ఆధారిత పాఠ్యాంశాలు, ఏఐ ఆధారిత పరిష్కారాలతో బోధనా శిక్షణ, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ వంటి వినూత్న కార్యక్రమాలను లీప్ ప్రోగ్రామ్ లో అమలు చేస్తున్నాం. ఏఐ, ఇతర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాల ద్వారా విద్యార్థులను టెక్నికల్, లీడర్ షిప్, రియల్ లైఫ్ నైపుణ్యాలతో సన్నద్ధం చేయడానికి ఫలితాల ఆధారిత విధానం అమలుకు శ్రీకారం చుట్టాం. NEP 2020 లక్ష్యాలకు అనుగుణంగా సవరించిన పాఠ్యాంశాలు, భవిష్యత్ నైపుణ్యాలు, డిజిటల్ ఎడ్యుకేషన్ ద్వారా సమగ్ర అభ్యాసం కొత్త విధానంలో అంతర్భాగంగా ఉన్నాయని చెప్పారు. అన్ని స్థాయిల్లో నైతిక విలువలకు పెద్దపీట వేస్తూ ప్రత్యేకంగా పాఠ్యాంశాలు ప్రవేశపెట్టామని మంత్రి లోకేష్ తెలిపారు.

స్టడీ మెల్‌బోర్న్ ప్రతినిధులు మాట్లాడుతూ... ప్రతి ఏటా 170 దేశాల నుంచి 1.75 లక్షల మందికి పైగా అంతర్జాతీయ విద్యార్థులు విద్యాభ్యాసం కోసం విక్టోరియా వస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా చైనా, భారత్, వియత్నాం, నేపాల్ నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు వస్తున్నట్లు చెప్పారు. వీరిద్వారా విక్టోరియా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు $12.6 బిలియన్ల ఆదాయం లభిస్తుందని అన్నారు. ఆస్ట్రేలియాలో పోస్ట్ స్టడీ పని అవకాశాలను కోరుకునే విద్యార్థులకు విక్టోరియా గమ్యస్థానంగా ఉందని తెలిపారు. ఆవిష్కరణ, పరిశోధన, సృజనాత్మకతలకు పెద్దపీట వేస్తూ... విక్టోరియాలో చదువుతో పాటు స్కాలర్ షిప్ లు, పని అవకాశాలు వంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నామని చెప్పారు. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యార్థులకు విక్టోరియా నెం.1 గమ్యస్థానంగా ఉంది. హైక్వాలిటీ ఎడ్యుకేషన్, కల్చరల్ డైవర్సిటీ, ఉత్సాహభరితమైన జీవనశైలి తమ ప్రత్యేకతలని తెలిపారు. వరల్డ్ మోస్ట్ లివబుల్ సిటీల్లో మెల్ బోర్న్ నెం.1 ర్యాంకు సాధించిందని స్టడీ మెల్‌బోర్న్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెల్‌బోర్న్ యూనివర్సిటీ, మోనాష్ యూనివర్సిటీ, స్విన్ బర్న్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 2047నాటికి గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్!

- $2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా అడుగులు
- జనవరి నుంచి అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సేవలు
- ఆస్ట్రేడ్ ఎగ్జిక్యూటివ్స్ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్

2 లో

## గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల శ్రమ

- మాతో చేతులు కలిపిన తర్వాత మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్
- ఏపీకి 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆరంభం మాత్రమే
- దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది
- విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుంది
- మెల్ బోర్న్ లో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షో లో మంత్రి నారా లోకేష్

2 లో

## అర్హులకు ఇళ్లు,ఇళ్ల స్థలాలు



- రాష్ట్ర గృహ నిర్మాణ & సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలు అందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ & సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రి వర్గ ఉప సంఘం సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ గత ప్రభుత్వం సెంటు, సెంటున్నర స్థలాలని నివాస యోగ్యం కాని, నిర్మాణాలకు అనువుకాని ప్రాంతాల్లో స్థలాలను ఇచ్చి ప్రజలకు గుదిబండల్లా మార్చడం జరిగిందన్నారు. ఎక్కడైతే నిర్మాణాలు జరుగలేదో అటు వంటి లేఅవుట్లలో లబ్దిదారులను ఒప్పించి చట్టపరంగా వాటిని రద్దుచేసి వారికి మళ్లీ రెండు, మూడు సెంట్లు ఇచ్చే అవకాశాన్ని నేటి సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. చాలా చోట్ల ఈ లేఅవుట్ల నిర్మాణాలకై ప్రైవేటు భూములను సేకరించి,

మిగతా 2లో...

## సాంకేతికతతో అభివృద్ధి.. ఆవిష్కరణలతో ఎదుగుదల

- నవీన ఆలోచనలతో భవిష్యత్తు నిర్మించండి
- సాంకేతికతను సాధనగా మలుచుకొని ముందడుగు వేయండి
- విజయం కోసం ప్రయత్నం ఆపొద్దు... సాధించాలనే తపన ఉంటే మార్గం తానే వస్తుంది
- మైక్రోసాఫ్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అండ్ ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్
- టెక్నాలజీతోనే అభివృద్ధి సాధ్యం - ఆలపాటి రాజేంద్రప్రసాద్
- ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర స్థాయి సాంకేతిక సదస్సు




**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** అపజయాలకు కుంగిపోకుండా, సాంకేతికతను సాధనగా మలుచుకొని ముందడుగు వేస్తే విజయం తప్పదని మైక్రోసాఫ్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ మరియు ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్ అన్నారు. నవీన ఆలోచనలతో భవిష్యత్తు నిర్మించగల యువతే భారత అభివృద్ధికి మార్గదర్శకులని సూచించారు. మనసును ప్రశాంతంగా ఉంచి కృషి చేస్తే ఏ లక్ష్యం అయినా సాధ్యమవుతుందని ఆయన ప్రేరణనిచ్చారు. విశదల అడ్డరోడ్డు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంకేతిక సదస్సులో ఆయన ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. రాజీవ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. విద్యార్థులు ఆయనకు ఘన సత్కారం అందించారు.

ఈ సందర్భంగా ఆయన కృత్రిమ మేధస్సు, మైక్రోసాఫ్ట్ ఆవిష్కరణలు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మిగతా 3లో...

## మైనార్టీ యువతకు " జర్మనీ"లో ఉద్యోగ అవకాశాలు

- ఎలక్ట్రిషియన్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం
- నవంబర్ 2 తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం
- నెలకు రూ.2.60 లక్షలుపైబడి జీతం
- రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్రంలోని మైనారిటీ యువతకు జర్మనీ దేశంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కూటమి ప్రభుత్వం నేతృత్వంలో కల్పిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ( ఏపీ ఎస్ ఎస్ డి సి ), ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ( ఓ ఎం సి ఏ పి ), ఐ ఈ ఎస్ ల సహకారంతో, జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

మిగతా 2లో...

## అడవులు జాతి సంపద... ప్రతి అంగుళం అమూల్యం




- అడవుల ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించం
- శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు చల్లించేందుకు ప్రణాళిక
- దేశ అవసరాలకు తగిన కలప రాష్ట్రం నుంచి అందిద్దాం
- ఎకో టూరిజం ప్రోత్సాహంతో గిరిజన యువతకు ఉపాధి
- అటవీ శాఖను ఆదాయార్జన శాఖగా తయారు చేయాలి
- గ్రేట్ గ్రీన్ వాల్ రాష్ట్రానికి వరం కావాలి
- అటవీ శాఖ సిబ్బంది భద్రతకు అధిక ప్రాధాన్యం
- రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల వర్క్ షాప్ లో ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) :** 'అడవులు జాతీయ ఆస్తి. వాటిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. అడవుల రక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. అడవులను రక్షించుకునే విషయంలో రాజకీయలకు తావుండదు. రాజీకి తావుండదు. అడవులు జాతి సంపద, ప్రతి అంగుళం అమూల్యం.

మిగతా 3లో...

## అగ్నికీలల్లో బస్సు... 19 మంది సజీవ దహనం

**కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. కావేరి ట్రావెల్స్‌కు చెందిన వోల్వో బస్సు హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్నది. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో కర్నూలు శివారు చిన్నటేకూరు సమీపంలో బస్సు ఓ బైకును ఢీట్టింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్రమంగా బస్సు మొత్తం అగ్నికి దగ్ధమైంది. బస్సులో అంతా నిద్రిస్తున్న సమయంలో ప్రమాదం జరగడంతో పలువురు సజీవదహనమయ్యారు. ప్రమాద సమయంలో బస్సులో 42 మంది వరకు ప్రయాణిస్తున్నారు. ఎమర్జెన్సీ డోర్ నుంచి 20 నుంచి 25 మంది వరకు బయటపడినట్లు, 19 మంది వరకు దుర్మరణం చెందినట్లు సమాచారం. బైక్‌పై వెళుతున్నవారు కూడా మరణించారు. పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. గాయపడినవారిని కర్నూలు జీజీహెచ్‌కు తరలించారు. వారిలో ఎవరికీ





ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ప్రమాదం తర్వాత ఘటనా స్థలం నుంచి ట్రావెల్స్ బస్సు డ్రైవర్, సిబ్బంది పరారయ్యారు. ప్రయాణికుల్లో ఎక్కువమంది హైదరాబాద్ నగరానికి చెందినవారు ఉన్నట్లు సమాచారం. అగ్నిప్రమాదం జరగడంతో జాతీయర రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై సీఎం తీవ్ర దిగ్భ్రాంతి**

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు నేటి తెల్లవారు జామున కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద ఘోర అగ్ని ప్రమాదానికి గురై పలువురు మరణించడం, మరికొంత మంది తీవ్రగాయాలు పాలు కావడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. దుబాయ్ పర్యటనలో ఉన్న ఆయన అక్కడ నుండే రాష్ట్రఅధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

మిగతా 2లో...

## నూతన వైద్య కళాశాలల సంక్షోభానికి జగనే కారణం

- ప్రైవేటీకరణ ఆరోపణలపై విచారణకు కమిటీకి ప్రభుత్వం సిద్ధం
- పరిష్కారం కోసమే పీపీపీ విధానమన్న మంత్రి సత్యకుమార్ యాదవ్
- పీపీపీ కింద 220 అదనపు సీట్లు ప్రతి ఏడాది లభిస్తాయి.... ఇది 2 నూతన కళాశాలల ఏర్పాటుకు సమానం
- ప్రజల కోసం సమగ్ర సమాచారంతో 12 పేజీల కరదీపకను విడుదల చేసిన మంత్రి
- ప్రజల తరపున జగన్ కు 30 ప్రశ్నలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) :** పది నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతుందంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి చేస్తున్న ఆరోపణలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధీటుగా స్పందించారు. ఈ ఆరోపణలకు సంబంధించి నిజనిజాలను తేల్చేందుకు నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉందని శుక్రవారంనాడు మంత్రి వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ... ఈ కమిటీ ప్రభుత్వం చేపట్టనున్న పబ్లిక్, ప్రైవేటు పార్టనర్షిప్ (పీపీపీ) విధానం ప్రైవేటీకరణకే కిందకి వస్తుందని కానీ, లేక దీనివల్ల ప్రైవేటీకరణ ఫలితాలే సంభవిస్తాయని కానీ నిర్ధారిస్తే




కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునస్సమీక్ష చేస్తుందని మంత్రి స్పష్టంచేశారు. ఈ కమిటీని ఏర్పాటుచేసేందుకు మాజీ సీఎం ఇద్దరు లేదా ముగ్గురు నిపుణులను త్వరగా సూచించాలని మంత్రి కోరారు. నిర్దిష్ట కాలపరిమితిలో ఈ కమిటీ తమ నివేదికను అందించేలా.. చర్యలు చేబడతామని, తద్వారా ప్రజలకు పీపీపీ విధానంలో పది కళాశాలల అభివృద్ధికి సంబంధించిన వాస్తవాలు తెలుస్తాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.

**సంక్షోభానికి మూలాలు :** రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన జగన్రెడ్డి ఆ మేరకు తగు చర్యలు చేపట్టకపోవడంవల్లనే సంక్షోభం ఏర్పడిందని... పది కళాశాలలకు సంబంధించి ఈ సంక్షోభం మరీ

మిగతా 3లో...

# అర్హులకు ఇళ్లు,ఇళ్ల స్థలాలు



(మొదటి పేజీ తరువాయి)

భూ యజమానులకు సొమ్మును చెల్లించడపోవడం వల్ల లబ్ధిదారులకు పట్టాలను కూడా అందజేయడం జరుగలేదన్నారు. అదే విధంగా భూ యజమానులకు డబ్బులు కూడా అందక పలు ఇబ్బందులకు గురవ్వడమే కాకుండా తీవ్రంగా నష్టపోవడం జరిగిందన్నారు. ఈ సమస్యను పరిష్కరించి ఏ విధంగా లబ్ధిదారులకు న్యాయం చేయాలనే కోణంలో మంత్రి వర్గ ఉప సంఘం సమావేశంలో సుదీరంగా చర్చించడం జరిగిందన్నారు. ఈ అంశంపై అధికారుల స్థాయిలో కూడా మరోకసారి సమావేశాన్ని నిర్వహించిన తదుపరి మంత్రి వర్గ ఉప సంఘం భవిష్యత్ కార్యాచరణ ప్రణాకపై తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు.

అదే విధంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో లీగల్ గా ఉన్న అడ్డంకులను అధిగమించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అవకాశాన్ని పరిశీలించేందుకు అడ్వకేట్ జనరల్ తో సంప్రదిస్తామని, వారి అభిప్రాయ తదుపరి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి తదుపరి సమావేశంలో తగు నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. జర్నలిస్టులకు ఇచ్చే స్థలాల్లో ఇళ్లు కూడా కట్టించే విధంగా తగు నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

# 2047నాటికి గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్ గా ఆంధ్రప్రదేశ్!

**ఆస్ట్రేలియా (మెల్బోర్న్):** ఆంధ్రప్రదేశ్ ను 2047 నాటికి గ్లోబల్ ఎకనమిక్ పవర్ హౌస్ గా మార్చడమే మా లక్ష్యం. సాంకేతిక ఆవిష్కరణలు, సుస్థిరమైన సమగ్రాభివృద్ధి ద్వారా ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే తమ సంకల్పమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మెల్బోర్న్ లో ఆస్ట్రేలియా ట్రేడ్ అండ్ ఇన్వెస్టిమెంట్ కమిషన్ ఎగ్జిక్యూటివ్ లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి లోకేష్ ప్రసంగించారు. ఈ సమావేశానికి ఆస్ట్రేడ్ అంతర్జాతీయ విద్య, వాణిజ్య సేవా నైపుణ్యం, డిజిటల్ డెలివరీ విభాగాధిపతి శ్రీమతి ఎలోడీ జర్నెట్ అధ్యక్షత వహించగా, లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ.... విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దిశగా శరవేగంగా దూసుకుపోతోంది, గత 16నెలల్లోనే $117 బిలియన్ డాలర్ల పెట్టుబడులు సాధించాం. సుదీర్ఘమైన పాలనానుభవం, సమర్థవంతమైన దార్శనిక నాయకుడి వల్లే ఇది సాధ్యమైంది. ఏరోస్పేస్ & డిఫెన్స్, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, డీప్‌టెక్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్, పోర్టులు, ఫార్మా, బయోటెక్నాలజీ, టూరిజం వంటి రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో విశేష పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి.



బలమైన విధాన వ్యవస్థ, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, మూడు ఆర్థిక కారిడార్లు, భవిష్యత్ సిద్ధమైన శ్రామిక శక్తి, క్వాంటం కంప్యూటింగ్, డీప్‌టెక్, గ్రీన్ ఎనర్జీ వ్యాలీ వంటి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి మూలస్తంభాలుగా ఉన్నాయి. అధునాతన సాంకేతికత, ఏఐ ఆధారిత గవర్నెన్స్ వేగవంతమైన అభివృద్ధికి దన్నుగా నిలుస్తున్నాయి. అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ 4.0తో పాటు 24థీమెటిక్ పాలసీలను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఏఐ వంటి అధునాతన సాంకేతిక రంగంతోపాటు డ్రోన్లు, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లపై ప్రత్యేకంగా దృష్టిసారించాం. 1053 కి.మీ.ల సువిశాల తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ లో ప్రస్తుతం 6 ఆపరేషనల్ పోర్టుల ద్వారా ఏటా 193 మిలియన్ మెట్రిక్ టన్నులు సరుకు రవాణా అవుతోంది. వచ్చే ఏడాదికల్లా 350 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల మరో 4 గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు ప్రారంభం కానున్నాయి. తూర్పు తీర సముద్ర కార్గో రవాణాలో 40శాతం ఏపీ నుంచే సాగుతోంది. ప్రస్తుతం $20 బిలియన్లుగా ఉన్న ఎగుమతులను 2047 నాటికి 450 బిలియన్ డాలర్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం.

విశాఖపట్నం ఐటీ, ఇన్నోవేషన్, డేటా హబ్‌గా తయారవుతోంది. విశాఖలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో ఏఐ హబ్ నిర్మించబోతోంది. అదేవిధంగా ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.35లక్షల కోట్లతో దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయబోతోంది. భారీ పెట్టుబడులకు విశాఖపట్నం గేట్ వేగా మారింది. విశాఖ మహానగరం 2047 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి సాధిస్తుంది. ఏపీ రాజధాని అమరావతిలో జనవరి నుంచి దక్షిణాసియాలోనే తొలి 156-క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్ సేవలు ప్రారంభించబోతున్నాం. ఇది భారత సాంకేతికరంగంలో గేమ్ ఛేంజర్ కాబోతుంది. అమరావతిలో స్టేట్ డేటా లేక్, అవేర్ హబ్, ఇంటెలిజెన్స్ లేయర్, డిజిటల్ గవర్నెన్స్ వంటివి అంతర్భాగాలుగా ఉంటాయి. ప్రస్తుతం $180 బిలియన్ డాలర్లుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ... 2047నాటికి $2.4 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా ముందుకు సాగుతోంది, నవంబర్ 14-15 తేదీల్లో విశాఖపట్నంలో తాము ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న పార్టనర్ షిప్ సమ్మిట్ -2025కు ఆస్ట్రేలియన్ పారిశ్రామికవేత్తలు హాజరై ఏపీలో పెట్టుబడి అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు.

# గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల శ్రమ


**మెల్ బోర్న్(ఆస్ట్రేలియా):** ఆంధ్రప్రదేశ్ కు గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ దాగి ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ఆరో రోజు.. ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులతో మెల్ బోర్న్ లోని గ్రాండ్ హయత్ హొటల్ ది రెసిడెన్సీ హాల్ లో నిర్వహించిన సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ రోడ్ షోలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్పెషల్ విజిట్స్ ప్రోగ్రామ్ కు ఆహ్వానించినందుకు ఆస్ట్రేలియా ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. దేశంలో మీ పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్ ను ఎందుకు పరిగణించాలో మూడు ప్రధాన కారణాలు చెబుతాను. ఏపీలో అనుభవం కలిగిన దార్శనిక నాయకత్వం ఉంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు నాలుగోసారి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. పెద్ద ప్రాజెక్టులను రాష్ట్రానికి ఎలా తీసుకురావాలో ఆయనకు బాగా తెలుసు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. దీనివల్ల దేశంతో పాటు ఏపీలో కూడా సాఫీగా పెట్టుబడులు పెట్టేందుకు మీకు సహకారం లభిస్తుంది. ఏపీలో 50శాతం మంది ఎమ్మెల్యేలు కొత్తగా ఎన్నికయ్యారు. 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు ఉన్నారు. రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు మేమంతా కసితో పనిచేస్తున్నాం.

**మాతో చేతులు కలిపిన తర్వాత మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్**

రెండో కారణం.. ఏపీ స్టార్టప్ స్టేట్. చేపట్టిన పనులు పూర్తిచేయాలనే ధృడసంకల్పంతో ఉన్నాం. మీరు ఒకసారి మాతో చేతులు కలిపిన తర్వాత అది మీ ప్రాజెక్ట్ కాదు.. మన ప్రాజెక్ట్. మొదటగా మేం ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేస్తాం. ఆయా ప్రాజెక్ట్ కు సంబంధించిన అధికారులు, నాయకులతో నిరంతరం ప్రాజెక్ట్ పురోగతిపై రోజువారీ పద్ధతిలో చర్చిస్తాం. ప్రాజెక్ట్ ఏ దశలో ఉందో, ఏం చేయాలో తెలుసుకుంటాం. ఉదాహరణకు ఆతిథ్య సేవల రంగంలో ఈ రోజు ఉదయం ఓ కంపెనీకి భూమి కేటాయింపు ప్రస్తుత పరిస్థితి, ఫైల్ ఎక్కడ ఉందో, క్లియరెన్స్ ఎప్పుడు వస్తుందో అన్న వివరాలు పంపించాం. ఇచ్చిన హామీని అమలుచేయడం మాకు చాలా ముఖ్యం. మీ ప్రాజెక్ట్ ను నిరంతరం ఫాలో అప్ చేస్తాం. మీరు నిర్దేశించిన సమయం కంటే వేగంగా పూర్తిచేయడమే మా లక్ష్యం.

**ఏపీకి గూగుల్ సంస్థ రావడం వెనుక 13 నెలల నిరంతర శ్రమ ఉంది**

ఏపీకి గూగుల్ డేటా హబ్ గురించి అందరూ వినే ఉంటారు. దాని వెనుక 13 నెలల నిరంతర శ్రమ దాగి ఉంది. ఆ సంస్థ నాయకత్వం మొదట వచ్చినప్పుడు నేను స్వయంగా వాళ్లను తీసుకెళ్లి ప్రాజెక్ట్ వచ్చే స్థలాన్ని చూపించాను. తర్వాత నేను వారి కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లి ఎందుకు ఏపీని ఎంచుకోవాలనే అంశంపై వారిని ఒప్పించాను. తర్వాత గూగుల్ నాయకత్వం వచ్చి ముఖ్యమంత్రి గారిని ఏపీలో కలిశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల్లో కొన్ని మార్పులు చేయాలని వారు కోరారు. ప్రధానమంత్రి మోదీ గారు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారు, కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గారితో మాట్లాడి అవసరమైన విధానపరమైన సవరణలు చేశాం. దీంతో గూగుల్ ప్రాజెక్ట్ మాత్రమే కాదు.. భారతదేశం గ్లోబల్ డేటా సెంటర్ హబ్ గా ఎదిగేందుకు మార్గం సుగమమైంది.



ఆ ప్రాజెక్ట్ ను మేం 13 నెలల్లోనే పూర్తిచేశాం. మేం చెప్పిన సమయం కంటే ఒక నెల మాత్రమే ఆలస్యమైంది. నెల ఆలస్యంపై ఇప్పటికీ మేం బాధపడుతుంటాం. ఆదిత్య మిట్టల్ గారు, నాకు మధ్య ఒక్క జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఆర్సెల్లర్ మిట్టల్ ఏపీకి వచ్చింది. ఇందుకు కావాల్సిన అనుమతులపై ప్రధాని మోదీ గారితో చర్చించి మార్గం సుగమం చేశాం. నవంబర్ లో ఈ ప్రాజెక్ట్ కు శంకుస్థాపన చేయనున్నాం. 15 నెలల్లోనే ఈ ప్రాజెక్ట్ ఏపీకి వ్చచింది.

**ఏపీకి 16 నెలల్లోనే రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆరంభం మాత్రమే**

గత 16 నెలల్లో ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టబడులు వచ్చాయి. ఇది కేవలం ఆరంభం మాత్రమే. ఇంకా ఎంతో సాధించాల్సి ఉంది. దేశంలో సాఫ్ట్ ల్యాండింగ్ కు మేం మీ వెంటే ఉంటాం. దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో మీ ప్రతి ఆలోచన, ప్రాజెక్ట్ కు మేం పూర్తి మద్దతు ఇస్తాం. మీ పెట్టుబడుల గమస్థానంలో ఏపీని ఎందుకు ఎంచుకోవాలనేందుకు మూడో కారణం.. మాది జాతీయ దృక్పథం కలిగి ఉన్న ప్రాంతీయ పార్టీ. రెండు రాష్ట్రాల్లో ఉన్నాం. ప్రాంతీయ పార్టీ అయినప్పటికీ దేశ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తాం. దేశ అభివృద్ధికి తోడ్పడే విధంగా మేం ఎప్పుడూ జాతీయ విధానాలపై సానుకూల ప్రభావం చూపాం. ఈ ప్రక్రియలో ఏపీకి కూడా ప్రయోజనం లభించింది. గతంలో చంద్రబాబునాయుడు గారి హయాంలో కూడా టెలికాం, విమానయాన రంగం, డిజిటల్ చెల్లింపులు వంటి సంస్కరణల్లో కీలకపాత్ర పోషించారు. ఇప్పుడు డేటా సెంటర్ విధాన సంస్కరణల్లో కీలకపాత్ర పోషించారు.

**ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దుతాం**

ప్రస్తుత ప్రపంచం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సవాళ్లను అవకాశాలుగా మలచుకోవాలి. దేశంలో ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కలిసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో చేయాల్సిన విధానపరమైన మార్పులు గుర్తించి, వాటిని అమలుచేసే పనిలో ఉన్నాం. ఇందుకు ఉదాహరణ కార్మిక సంస్కరణలు. 9 సంస్కరణల్లో మార్పులు చేయాలని సూచించారు. 8 సంస్కరణలను 15 రోజుల్లోనే మేం పూర్తిచేశాం. మేం ప్రస్తుతం 180 బిలియన్ల ఆర్థిక వ్యవస్థను కలిగి ఉన్నాం. దీనిని 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తీసుకెళ్తాం. మేం కేవలం ఒకటి, రెండు రంగాలపైనే దృష్టిపెట్టలేదు. 15 రంగాలపై దృష్టి కేంద్రీకరించాం. క్లస్టర్ విధానంలో అభివృద్ధి చేస్తాం. ఆటోమోటివ్, సిమెంట్, పునరుత్పాదక రంగం, ఎలక్టానిక్స్, కంప్రెస్డ్ బయోగ్యాస్, ఫార్మా, స్టీల్, ఆక్వా, క్వాంటం కంప్యూటింగ్ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాం. దేశంలో తయారవుతున్న ఏసీల్లో సగం ఏపీలోని తయారవుతున్నాయి. దీనిని 70శాతానికి తీసుకెళ్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం.

**దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది**

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఏపీ రెండో స్థానంలో ఉంది. ఈ పెట్టుబడుల ద్వారా త్వరలోనే నెం.1 అవుతాం. మేం కేవలం ఎంవోయూల కుదుర్చుకోవడమే కాకుండా ప్రాజెక్టుల గ్రౌండింగ్ కోసం కృషిచేస్తున్నాం. విశాఖలో నవంబర్ 14,15 తేదీల్లో పార్ట్ నర్ షిప్ సమ్మిట్ జరగబోతోంది. ఇదో అద్భుతమైన నగరం. పార్ట్ నర్ షిప్ సమ్మిట్ క్ హాజరై పెట్టుబడులకు గల అవకాశాలను పరిశీలించాలి. బెంగళూరు, గోవా నగరాల కలయిక విశాఖపట్నం. దేశంలోనే 9వ అతిపెద్ద ఆర్థిక నగరంగా విశాఖ ఉంది. త్వరలోనే టాప్-3 లో నిలవనుంది. విశాఖపట్నం ఎకనామిక్ కారిడార్ ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా ఇండియా బిజినెస్ కౌన్సిల్ నేషనల్ ఛైర్ దీపక్ రాజ్ గుప్తా, కాన్సుల్ జనరల్ ఆఫ్ ఇండియా(మెల్ బోర్న్) డాక్టర్ సుశీల్ కుమార్, సీఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) డైరెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ యువతకు " జర్మనీ"లో ఉద్యోగ అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

రెండు సంవత్సరాల ఐటిఐ లేదా మూడు సంవత్సరాల ఎలక్ట్రిషియన్ ట్రేడ్ విద్యార్హతతో ఉత్తీర్ణత సాధించిన వారు జర్మనీ ఉద్యోగాలకు అర్హులన్నారు. వ-యో పరిమితి గరిష్టంగా 30 సంవత్సరాలు లోపు ఉన్నవారు,కనీసం రెండేళ్ల సంబంధిత ఎలక్ట్రిషియన్ పనులలో అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

**నెలకు 2.60 లక్షలు పైబడిన జీతంతో ఉద్యోగాలు**

జర్మనీ దేశంలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు ఎంపికైన వారికి భారీగా జీతం ఉంటుందని మంత్రి ఫరూక్ తెలిపారు. నెలకు 2,600 నుండి 2,700 యూరోలు ( భారత కరెన్సీలో రూ. 2.60 లక్షల నుండి రూ. 2.70 లక్షలు) జీతం పొందవచ్చునని అన్నారు. రెండేళ్ల ఒప్పందం మేరకు జర్మనీలో ఉద్యోగాలు చేసుకోవడానికి వీలు ఉందని తెలిపారు. ఒప్పందం ప్రకారం అదనపు పనికి అదనపు జీతం, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. జర్మనీలో అవసరమయ్యే అక్కడి స్థానిక గుర్తింపు, అనువాద ఖర్చులను యజమాని భరిస్తారని, వసతి,రాక (ఆరైవల్)సహాయంను అక్కడ యజమాని అందిస్తారని తెలిపారు. జర్మనీలో 6 నెలల ప్రొబేషన్ కాలం పూర్తయిన తర్వాత 1000 యూరోలు తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు.

**నవంబర్ నుండి జర్మనీ భాష పై శిక్షణ**

జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అర్హులకు జర్మనీ భాషపై పట్టు సాధించేందుకు వీలుగా ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు మంత్రి ఫరూక్ తెలిపారు. దాదాపు 12 లేదా 14 వారాల పాటు జర్మన్ భాష లోని ఏ-1,ఏ-2 స్థాయిల వరకు క్లాస్ రూమ్ శిక్షణ ను తాత్కాలికంగా రాజమండ్రి లో ఏర్పాటు చేసి రోజుకి 8 గంటలపాటు ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇందుకు ఖర్చును అభ్యర్థులే భరాయించాల్సి ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తు, శిక్షణ కోసం ఫీజు రూ. 1.15 లక్షలు ను మూడు వాయిదాలలో చెల్లించాల్సి ఉంటుందన్నారు. విమాన,వీసా తదితర ఛార్జీలు కూడా అభ్యర్థు లు స్వయంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. జర్మనీలో ఉద్యోగాల కోసం నవంబర్ 2వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. చెల్లుబాటు అయ్యే పాస్ పోర్టు, గతంలో పనిచేసిన కంపెనీల నుండి రిలీవింగ్ లెటర్,సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. లి లిరాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మైనారిటీ అభ్యర్థులందరూ వారి యొక్క బయోడేటా స్కిల్ ఇంటర్నేషనల్ ఏపీ ఎస్ ఎస్ డి సి. ఇన్ కు ఆన్లైన్ ద్వారా పంపించాలని మంత్రి కోరారు. మరిన్ని వివరాల కోసం, ఆసక్తి గల అభ్యర్థులు 9988853335, 8712655686, 8790118349, 8790117279 సెల్ నెంబర్లకు ఫోన్ చేయడం ద్వారా పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని, అర్హులైన మైనారిటీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

# అగ్నికీలల్లో బస్సు... 19 మంది సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

హొంమంత్రి, రవాణా శాఖ మంత్రి, సీఎస్, డీజీపీ, స్థానిక డీఐజీ, జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులు మరియు బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని, మృతుల సంఖ్య పెరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని, మృతదేహాలను గుర్తించి కుటుంబాలకు అప్పగించాలని సూచించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, ఘటనపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలంటూ సీఎం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లిన రవాణా శాఖ మంత్రి**

బస్సు ఘోర ప్రమాద ఘటనపై వెంటనే స్పందించిన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి హుటాహుటిన ఘటనాస్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేసిన ఆయన, ఈ ఘటన హృదయ విదారకమని పేర్కొన్నారు. క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు వేగంగా చేపట్టాలని రవాణా శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని రకాలుగా భద్రతా ప్రమాణాలు ఉండేలా చర్యలు చేపట్టాలని రవాణా శాఖ అధికారులను ఆయన ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బస్సు ప్రమాదంపై సీఎం చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని, ఇతర రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. మృతుల వివరాలు త్వరగా గుర్తించి వారి కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని సూచించారన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా వైద్యశాఖకు సూచనలు జారీ చేశారన్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల ఫిట్‌నెస్, సేఫ్టీ, పర్మిట్ తనిఖీలు కఠినంగా నిర్వహించాలని, అన్ని జిల్లాల్లో సాంకేతిక తనిఖీలు చేపట్టాలని రవాణా శాఖను ఆదేశించారు. ప్రమాదానికి నిర్లక్ష్యం కారణమై ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యత అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజల ప్రాణ భద్రతపై ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు.

**బాదిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హొం శాఖ మంత్రి హామీ**



రాష్ట్ర హొం మరియు విపత్తుల శాఖ మంత్రి వంగలపూడి అనిత కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు దగ్ధమైన ఘటనలో పలువురు మృతి చెందడంపై ఆమె తీవ్ర విచారం తెలిపారు. క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇలాంటి దుర్ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న హొం మంత్రి, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, వారికి అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

**క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేసిన వ్యవసాయ శాఖ మంత్రి**

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బస్సు ఘోర అగ్నిప్రమాదంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారని, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్యం అందించాల్సిందని అధికారులు ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేయగా, ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించే విధంగా తగు భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా ప్రైవేటు ట్రావెల్స్ సంస్థలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

**దుబాయ్ పర్యటనలోనున్న రహదారులు & భవనాల శాఖ మంత్రి తీవ్ర విచార వ్యక్తం..**

కర్నూలు జిల్లాలో బస్సు పూర్తిగా దగ్ధమైన ఘటనపై దుబాయ్ పర్యటనలోనున్న రాష్ట్ర రహదారులు & భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్ధన రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దుబాయ్ నుంచే జిల్లా అధికారులతో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. క్షతగాత్రులకు తక్షణ మరియు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైతే వారిని హైదరాబాద్‌కు తరలించాలని మంత్రి ఆదేశించారు. అనేక మంది ప్రయాణికులు సజీవదహనమైన వార్త తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ, ఇలాంటి దుర్ఘటన జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఆరోగ్య శాఖ మంత్రి..**

కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదంపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌కి ఆదేశాలు జారీ చేశారు. బస్సులోనే భౌతిక అవశేషాలు ఉన్నందున, అవసరమైతే ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఫోరెన్సిక్ వైద్యులను ఘటన స్థలానికి పంపించి, మృతులను గుర్తించేందుకు డీఎన్ఏ నమూనాలు సేకరించాలన ఆదేశించారు. మృతదేహాల తరలింపుకు మహాప్రస్థానం వాహనాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలతో 12 మంది ఆసుపత్రిలో చేరగా, ప్రాథమిక చికిత్స అనంతరం వారిలో ఆరుగురు డిశ్చార్జ్ అయ్యారని, ఒకరి పరిస్థితి నిలకడగానే ఉందని మంత్రి సత్యకుమార్ వివరించారు.

**బస్సు ఘోర ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణ జరపాలన్న మంత్రి ఫరూఖ్**

రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో ప్రయాణికులు సజీవదహనం కావడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్న ఆయన, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదం నుంచి బయటపడ్డ ప్రయాణికులకు అవసరమైన వైద్య సేవలు తక్షణం అందించాలని కర్నూలు జిల్లా అధికారులను ఆదేశించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరపాలని మంత్రి ఫరూక్ సూచించారు.

**రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి**

కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుబాయ్ పర్యటనలో ఉన్నప్పటికీ, ప్రమాద విషయం తెలిసిన వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందడంపై మంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

**రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి**

రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కర్నూలు బస్సు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడ్డ వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందజేయాలని సూచించారు.

**తక్షణ సహాయక చర్యలు చేపట్టిన కర్నూలు జిల్లా యంత్రాంగం**

కర్నూలు జిల్లా కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కర్నూలు జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. ప్రమాద స్థలానికి జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తక్షణమే జరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హైదరాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న కావేరి బస్సులో సుమారు 41 మంది ప్రయాణికులు ఉన్నారని, నేటి తెల్లవారుజామున 3 నుంచి 3:10 గంటల సమయంలో బస్సు ఒక బైక్‌ను ఢీకొనడం వల్ల ఇంధనం లీక్ అయి ప్రమాదం సంభవించిందని తెలిపారు. ఈ ఘటనలో 21 మంది సురక్షితంగా ఉన్నారని, మిగిలిన 20 మందిలో 11 మంది మృతదేహాలను గుర్తించగా, మిగిలిన వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది అని ఆమె తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాద బాధితులను ఆదుకునేందుకు పలు కంట్రోల్ రూములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 08518-277305, కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి కంట్రోల్ రూమ్ 9121101059, ఘటనాస్థలి కంట్రోల్ రూమ్ 9121101061, కర్నూలు పోలీస్ ఆఫీసు కంట్రోల్ రూమ్ 9121101075గా ప్రకటించడం జరిగిందన్నారు. అదనంగా, ఆస్పత్రి హెల్ప్‌డెస్క్ నంబర్లు 9494609814 మరియు 9052951010 ద్వారా కూడా బాధితుల కుటుంబాలు సమాచారం కోసం సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

## గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజలు, పార్టీ నేతల నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రజల నుండి ఎమ్మెల్యే గళ్ళా మాధవి శుక్రవారం అర్జీలు స్వీకరించారు. పలు సమస్యల పై సంబంధిత అధికారులకు చరవాణి నుండి ఆదేశించి, సమస్యను వెంటనే పరిశ్కరించాలన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని, ప్రతిరోజు ప్రజల మధ్య అందుబాటులో ప్రజలకు,పార్టీ శ్రేణులకు కార్యాలయంలో అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఎన్డీయే కూటమి పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష, అని ఇప్పటికే తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదని, అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలే మా లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌కు ప్రతిపాదనలు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):**పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ కు ప్రతిపాదనలు సమర్పించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ మినీ సమావేశమందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు 1200 ఓటర్లు కంటే అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాలను రేషనలైజేషన్ చేసి అక్టోబర్ 27 నాటికి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి ప్రతిపాదనలు అందించాల్సి ఉందన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్ లలో 1200 మంది ఓటర్లు ఉండేలా అదనంగా ఉన్న ఓటర్లను సమీపంలోని పోలింగ్ బూత్ లలో సర్దుబాటు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటును ప్రాధమికంగా పూర్తి చేయటం జరిగిందన్నారు. మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఏ ఈ ఆర్ వో లు సమావేశం నిర్వహించి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రతిపాదన పై చర్చించి అభిప్రాయాలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి అమోదం కోసం ఎన్నికల సంఘంకు రేషనలైజేషన్ ప్రతిపాదనలు పంపటం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే 2002నుంచి 2025వరకు ఉన్న ఓటరు జాబితాలను పరిశీలించి నివేదికను ఎన్నికల సంఘంకు అందించడం జరిగిందన్నారు. ఓటర్ నమోదు, తొలగింపుకు సంబంధించిన దరఖాస్తులను పెండింగ్ తదితర అంశాలను వివరించారు. పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవల్ ఏజెంట్ లను నియమించుకొని వివరాలను అందించాలని రాజకీయపార్టీల ప్రతినిధులకు సూచించారు.

ఈ సమావేశంలో అమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా. టి సేవా కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వైవీ సుబ్బారావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బి సునీల్ కుమార్, తెలుగుదేశం పార్టీ నుంచి కె శివరామయ్య, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కే ప్రేమ్ కుమార్, జనసేన పార్టీ ప్రతినిధి సీహెచ్ త్రినాధ్, ఈఆర్వోలు, విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజరు లక్ష్మీకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు చల్లా ఓటులేసు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి, ఏ ఈ ఆర్ వో లు తహసిల్దార్లు పాల్గొన్నారు.

## లాడ్జ్ ల నిర్వాహకులు నిబంధనలు విధిగా పాటించాలి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** పట్టణంలో లాడ్జిలు నిర్వహించే నిర్వాహకులు నిబంధనలు విధిగా పాటించాలని, అసాంఘిక కార్యకలాపాలకు ఎటువంటి అవకాశాలు కల్పించరాదని డీఎస్పీ బి జనార్దన్ రావు, లాడ్జిల నిర్వాహకులకు సూచించారు. త్రీ టౌన్ సీఐ,ఎస్ సాంబశివరావు శుక్రవారం తమ స్టేషన్ పరిధిలోని లాడ్జిలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఒక లాడ్జిలో రూము తీసుకున్న వ్యక్తి గదిని తనిఖీ చేయగా, అతని వద్ద, పురుగు మందు గుళికలను గుర్తించారు. ఈ విషయమై వివరణ కోరగా, వ్యాపారాల్లో నష్టం రావడం ద్వారా, ఆత్మహత్య చేసుకునేందుకు,
హైదరాబాదు నుండి వచ్చినట్లు తెలిసిందన్నారు.
ఈక్రమంలో,లాడ్జిల నిర్వహణలో అవకతవకలను గుర్తించిన అధికారులు, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లో, లాడ్జిల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా డిఎస్పీబీ జనార్దన్ రావు లాడ్జిల నిర్వాహకులకు స్పష్టమైన నిబంధనలను సూచించారు. లాడ్జి నిర్వాహకులు విధిగా సీసీ కెమెరాలు వినియోగించాలని, రిజిస్టర్ నిర్వహణ సక్రమంగా ఉండాలని, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా లాడ్జిలు నిర్వహించుకోవాలని సూచించారు. త్రీటౌన్ సీఐ సాంబశివరావు మాట్లాడుతూ లాడ్జిల తనిఖీలు ఇకనుండి తరచూ చేపడతామన్నారు. తాము చేపట్టిన లాడ్జిల్లా తనిఖీల ద్వారా, ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నాన్ని భగ్నం చేయగలిగామని, లాడ్జిల నిర్వాహకులు, విధిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే ఎదురయ్యే, ఏ సమస్యకైనా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కరిముల్లా సిబ్బంది ఉన్నారు.

# సాంకేతికతతో అభివృద్ధి.. ఆవిష్కరణలతో ఎదుగుదల

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ, కళాశాల సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తి, ఎన్ఆర్ఐ విద్యా సంస్థల చైర్మన్ ఆలపాటి రవీంద్ర, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం రాజీవ్ కుమార్ కళాశాలలో కొత్తగా నిర్మించిన ఎంబీఏ భవనాన్ని ప్రారంభించారు. మైక్రోసాఫ్ట్ భవిష్యత్తు, సాంకేతిక దిశలో భారత యువత పాత్రపై రాజీవ్ కుమార్ ఇచ్చిన స్ఫూర్తిదాయక సందేశం విద్యార్థులందరినీ ఆకట్టుకుంది.

**టెక్నాలజీతో ప్రపంచానికి దిశ చూపిన మైక్రోసాఫ్ట్ :** రాజీవ్ కుమార్ మాట్లాడుతూ, మైక్రోసాఫ్ట్ ఆవిర్భావం వెనుక ఉన్న ఆసక్తికర కథను వివరించారు. “బిల్ గేట్స్, పాల్ అలెన్ బాల్య స్నేహితులు. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ కంప్యూటర్ ల్యాబ్‌లో పర్సనల్ కంప్యూటర్లపై ప్రయోగాలు చేస్తూ పెరిగారు. ... ఈ ఇద్దరికీ ఒకటే ఆసక్తి. రాబోయే మార్పులను ముందుగానే ఊహించగలిగే దూరదృష్టి. అలాంటి ఇద్దరు టెక్నాలజీ నేస్తాలు కలిస్తే ఎలాంటి చరిత్ర రాస్తారో ప్రపంచం ఎన్నడో చూసింది %-% అదే మైక్రోసాఫ్ట్. గత ఐదు దశాబ్దాల సాంకేతిక విప్లవానికి నాంది పలికిన ఈ సంస్థ ప్రస్థానం అనూహ్యమని మైక్రోసాఫ్ట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ రాజీవ్ కుమార్ అభిప్రాయపడ్డారు.

పేరేచర్లలోని ఎన్ఆర్ఐ అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్ఆర్ఐ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. హాజరయ్యారు.

**బిల్‌గేట్స్-పాల్ అలెన్ స్నేహం పుట్టించిన చరిత్ర** :ఎంఐటీఎస్ సంస్థ రూపొందించిన ఆల్టేర్ 8800 పరికరం 1975లో విడుదలైనప్పుడు బిల్‌గేట్స్ హార్వర్డ్ విద్యార్థి, పాల్ అలెన్ ఉద్యోగం చేస్తున్నారు. ఆ





పరికరాన్ని చూసి ఇద్దరూ పర్సనల్ కంప్యూటర్ల భవిష్యత్‌ను ఊహించారు. ఆ పరికరానికి బేసిక్ ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌ను సృష్టించాలనే ఆలోచనతో ముందుకొచ్చారు. కేవలం 4 KB మెమరీలో పనిచేసేలా బిల్‌గేట్స్ రాసిన ఆ కోడ్ ఆధునిక కంప్యూటర్ విప్లవానికి ఆరంభమైందని రాజీవ్ కుమార్ గుర్తుచేశారు.

సాఫ్ట్‌వేర్ మరియు మైక్రోప్రాసెసర్ అనే రెండు పదాలను కలిపి ‘మైక్రో-సాఫ్ట్’ పేరును పెట్టి 1981లో సంస్థ ఆవిర్భవించిందని ఆయన వివరించారు. అదే సంవత్సరంలో ఐబీఎం సంస్థ ఎంఎస్-డాస్ 1.0తో పర్సనల్ కంప్యూటర్‌ను విడుదల చేసింది. 1990లో విండోస్ 3.0తో మైక్రోసాఫ్ట్ ప్రపంచంలో అగ్రగామిగా నిలిచిందని చెప్పారు.

1975లో ‘పాపులర్ మెకానిక్స్’ పత్రికలో ఆల్టేర్ 8800 కంప్యూటర్ కిట్ చిత్రాన్ని చూసి భవిష్యత్తు కంప్యూటర్ విప్లవమని గుర్తించారు. దానికి తగిన ప్రోగ్రామింగ్ భాషను రూపొందించాలని నిర్ణయించి, అదే ‘బేసిక్ ఇంటర్‌ప్రెటర్’గా రూపుదిద్దుకుంది,” అని వివరించారు..

**విండోస్ విప్లవం - సాఫ్ట్‌వేర్ నుంచి ప్రపంచాధిపత్యం వరకు :** విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ మొదట్లో ‘ఇంటర్‌ఫేస్ మేనేజర్’గా పిలిచారని, 1985లో ‘విండోస్’ అని పేరు మార్చి విడుదల చేశారని రాజీవ్ కుమార్ తెలిపారు. విండోస్ 95 నుంచి ప్రొడక్ట్ కీ యాక్టివేషన్‌ను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

విండోస్ పరిణామంలో ప్రాముఖ్యమైన ఫీచర్లలో ‘బ్రీఫ్‌కేస్’ టూల్, ‘ఫార్మాట్ డైలాగ్’, ‘ట్రూటైప్ ఫాంట్స్’, ‘కంట్రోల్‌ంఆల్ట్‌ండిలీట్’ షార్ట్‌కట్, కాలిక్యులేటర్, పెయింట్, నోట్‌ప్యాడ్, క్లాక్, కంట్రోల్ ప్యానల్ వంటి అప్లికేషన్లను ఆయన ఆసక్తికర రీతిలో వివరించారు. ఆపరేటింగ్ సిస్టమ్ ప్రారంభంగా ఎంఎస్-డాస్ మీద ఆధారపడినా, విండోస్ 95తో స్టాండలోన్ ఓఎస్‌గా వ్యవహరించిందని ఆయన చెప్పారు.

**“బిల్‌గేట్స్ దూరదృష్టి ప్రపంచాన్ని మార్చింది” :** “సాంకేతికత దిశను మార్చిన నిర్ణయాలు ఎప్పుడూ దూరదృష్టి గల మేధావుల చేతే వస్తాయి. బిల్‌గేట్స్-పాల్ అలెన్ చూపిన ఆ దిశే ఈరోజు మైక్రోసాఫ్ట్‌ను ప్రపంచ టెక్నాలజీ అగ్రాస్థానంలో నిలిపింది” అని రాజీవ్ కుమార్ అన్నారు.

**“టెక్నాలజీతోనే అభివృద్ధి సాధ్యం” - ఆలపాటి రాజేంద్రప్రసాద్ :** ఎమ్మెల్సీ, కళాశాల సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. గూగుల్, ఏఐ రంగాలపై ఆయన చూపుతున్న దృష్టి భవిష్యత్ రాష్ట్రానికి లాభదాయకమవుతుందని అన్నారు. యువత సాంకేతిక పరిజ్ఞానాన్ని లోతుగా నేర్చుకోవాలని సూచించారు.హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ మధుమూర్తి “మైక్రోసాఫ్ట్ భవిష్యత్తులో మరింతగా ప్రపంచ సాంకేతిక రంగంలో ఆధిపత్యం ప్రదర్శిస్తుంది” అన్నారు. ఎన్ఆర్ఐ చైర్మన్ నరేంద్ర ఆలపాటి మాట్లాడుతూ, “మైక్రోసాఫ్ట్ ఎండి రాజీవ్ కుమార్ ప్రేరణతో నేటి విద్యార్థులు సాంకేతికత పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ప్రపంచ శాస్త్ర సాంకేతిక రంగాల్లో మన దేశం వేగంగా ముందుకు సాగుతున్నది” అన్నారు.

కార్యక్రమంలో కిట్స్ కళాశాల చైర్మన్ కోయ సుబ్బారావు, వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ఎన్ఆర్ఐ సీఈవో కే.శరత్, ప్రిన్సిపాల్ సంజయ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్, సీతారామయ్య తదితరులు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# నూతన వైద్య కళాశాలల సంక్షోభానికి జగనే కారణం

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర స్థాయిలో ఉందని.. దీనికి ప్రధాన కారకుడు మాజీ ముఖ్యమంత్రేనని సోదాహరణంగా మంత్రి స్పష్టంచేశారు. ఈ కళాశాలల నిర్మాణం కోసం మొత్తం రూ. 8,480 కోట్లు వెచ్చించాల్సి ఉండగా, ప్రకటన అనంతరం నాలుగేళ్లలో జగన్మోహన్రెడ్డి కేవలం రూ. 1,550.39 కోట్లు (18%)మాత్రమే వ్యయంచేసినందున సంక్షోభం నెలకొందని మంత్రి అన్నారు. పర్యవసానంగా... 2023-26 మధ్యకాలంలో (మూడేళ్లు) మొత్తం 2,550 కొత్త ఎంబీబీఎస్ ప్రవేశాలు కల్పిస్తామని శ్రీ జగన్రెడ్డి ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయిందని, కేవలం 800 ప్రవేశాలు మాత్రమే జరిగాయని మంత్రి వివరించారు.

**10 కళాశాలల దైన్యస్థితి :** ప్రభుత్వం పీపీపీ విధానంలో చేపట్టదల్చిన కళాశాలల నిర్మాణానికి సంబంధించి మాజీ సీఎం నిర్వాకాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వివరించారు. ఈ కళాశాలల నిర్మాణాలకు సంబంధించి మొత్తం రూ. 4,995 కోట్లు వెచ్చించాల్సి ఉండగా జగన్రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కేవలం రూ. 631.77 కోట్లు మాత్రమే (12.75%)వెచ్చించడంతో ఈ కళాశాలలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయ్యాయని మంత్రి అన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రి పాత్రికేయులకు వెల్లడించారు. శ్రీ జగన్రెడ్డి పార్వతీపురం కళాశాల కోసం కనీసం భూ సేకరణ కూడా జరపలేదని మంత్రి తెలిపారు. మరో 8 కళాశాలలకు సంబంధించి వైకాపా హయాంలో జరిగిన వ్యయం రూ. 0.59 కోట్ల నుంచి రూ. 60.85 కోట్లు మాత్రమేనని, రూ. 500 కోట్ల వ్యయంతో కూడిన ఒక్క పులివెందుల కళాశాల కోసమే జగన్ భారీ స్థాయిలో రూ. 396.16 కోట్లు (80%) వెచ్చించారని ఆయన తెలిపారు.

పాలకొల్లు కళాశాలను రూ. 475 కోట్లతో నిర్మించాల్సి ఉండగా గత ప్రభుత్వం కేవలం రూ. 0.59 కోట్లు (0.12%) మాత్రమే వెచ్చించింది. నర్సీపట్నం కళాశాల-రూ. 500 కోట్లు/రూ. 10.70 కోట్లు/2.14%, పెనుకొండ-రూ. 475 కోట్లు/రూ. 18.98కోట్లు (3.99%), బాపట్ల-రూ. 505 కోట్లు/రూ. 22.10 కోట్లు (2.14%), మదనపల్లి-రూ. 475 కోట్లు/రూ. 28.54 కోట్లు (6.00%), మార్కాపురం - రూ. 475 కోట్లు/రూ. 46.26 కోట్లు (9.74%), ఆదోని రూ. 475 కోట్లు/రూ. 47.59కోట్లు (10.01%),ఈ పది కళాశాలలకు సంబంధించి ప్రణాళిక మేరకు మొత్తం 132.43 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణ పనులు చేపట్టి పూర్తిచేయాల్సి ఉండగా జగన్ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల్లో కేవలం 27.72 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం (23.93%) మేరకు మాత్రమే నిర్మాణాలు పూర్తిచేసిందని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వివరించారు. పార్వతీపురం, పాలకొల్లు కళాశాలలకు సంబంధించి ఎటువంటి నిర్మాణాలు జరగలేదని, బాపట్ల కళాశాల పనులు కేవలం పునాదులకు మాత్రమే పరిమితయ్యాయని మంత్రి వివరించారు. మరో 6 కళాశాలలకు సంబంధించి 0.89% నుంచి 3.61% మేరకే పనులు పూర్తయ్యాయని తెలుపుతూ.... మాజీ సీఎం సొంత నియోజకవర్గంలోని పులివెందుల కళాశాలకు సంబంధించి మాత్రం 95.41% నిర్మాణాలు పూర్తిచేశారన్నారు.

**తనకో రూలు... ఇతరులకు మరోటా? :** నాలుగేళ్ల కాలంలో వైద్య కళాశాలల నిర్మాణాల కోసం అత్యల్పంగా ఖర్చుచేసిన మాజీ సీఎం జూన్, 2024లో అధికారంలోనికి వచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లలోపే 17 కళాశాలల నిర్మాణాలను పూర్తిచేసేందుకు భారీస్థాయిలో రూ. 6,930 కోట్లు ఖర్చు చేయాలని డిమాండ్ చేయడాన్ని మంత్రి సత్యకుమార్యాదవ్ తప్పుబట్టారు. సాలీనా జగన్ రెడ్డిచేసిన రూ. 387 కోట్ల వ్యయం ఆయన హయాంలోనే ఆరిక దుసితికి నిదర్శనమన్నారు. అటువంటి దుర్భర పరిస్థితి కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనతికాలంలోనే ఎలా మెరుగు అవుతుందో జగన్రెడ్డే చెప్పాలని మంత్రి అన్నారు. తాను ప్రతిపాదించిన వైద్య కళాశాలల నిర్మాణం సంక్షోభంలో కూరుకుపోవడంపట్ల మాజీ సీఎం ఆత్మవిమర్శ చేసుకోవాలని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ సూచించారు. ఈ సంక్షోభ పరిసితిని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని చేపట్టాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడిందని ఆయన స్పష్టంచేశారు.

**పీపీపీతో ప్రయోజనాలు! :** కూటమి ప్రభుత్వం చేపట్టనున్న పీపీపీ విధానంతో కలిగే ప్రయోజనాలను మంత్రి వివరించారు: 1. ఈ విధానంలో ప్రతి కళాశాలలో 22 చొప్పున మొత్తం పది కళాశాలల్లో 220 సీట్లు కేవలం మన రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోనికి వస్తాయి. ఈ ఫలితం రెండు కొత్త వైద్య కళాశాలల ఏర్పాటుతో సమానం. 2. ప్రతి కళాశాల అనుబంధ ఆసుపత్రుల్లో 205 అదనపు పడకలతో మొత్తం పది ఆసుపత్రుల్లో 2,050 అదనపు పడకలు సమకూరతాయి. 3. వైద్య విద్య మరియు వైద్య సేవల నాణ్యత పెరుగుతుంది. 4. కళాశాలల నిర్మాణ మరియు నిర్వహణ వ్యయం తగ్గడంతో విలువైన ఆరిక వనరులు ఇతర పథకాలకు లభిస్తాయి. 5. వైద్య కళాశాలల నిర్మాణ, నిర్వహణలో ప్రైవేటు రంగంతో ముడిపడిన సామర్థ్యం జతకూడుతుంది. మరీ ముఖ్యంగా శ్రీ జగన్రెడ్డి తీరుతో 20 ఏళ్లలో పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందుబాటులో వచ్చే వైద్య కళాశాలలు తక్కువ వ్యవధిలో లభిస్తాయి. 6. వైద్య విద్య, సేవల రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఒనగూరుతుంది.

**ప్రజల కోసం, ప్రజల తరపున జగన్ కు 30 ప్రశ్నలు సంధించిన మంత్రి:** రాష్ట్రంలో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు సంబంధించి, మాజీ సీఎం జగన్ నిర్లక్ష్యం, అసమరత సంక్షోభానికి దారితీసిన తీరు, దానికి సంబంధించిన పలు అంశాలపై సమగ్ర సమాచారంతో కూడిన 12 పేజీల కరదీపికను మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం విడుదల చేశారు. దీని ద్వారా జగన్ కు మంత్రి 30 ప్రశ్నలు సంధించారు. ముఖ్యంగా.. (1) జగన్ 2,550 ఎంబీబీఎస్ ప్రవేశాలను మూడేళ్లలో 2025-26 నాటికే కల్పిస్తామని హామీ ఇచ్చారా?లేక 15-20 ఏళ్లలో అందుబాటులోనికి తెచ్చామని చెప్పారా? 2. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద మరియు నాబార్డుతో ఆరిక వనరుల లభ్యత కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ అవసరాల మేరకు వైద్య కళాశాలల నిర్మాణంపై ఎందుకు వ్యయం చేయలేకపోయ్యారు? 3 రాష్ట్ర వాటా కింద విడుదల చేయాల్సిన 20% నిధులను ఇవ్వలేకపోవడం మీ అసమరతకు నిదర్శనం కాదా? 4. అభివృద్ధి వికేంద్రీకరణ కోసమంటూ 3 రాజధానులను ప్రతిపాదించిన జగన్ ఇతర ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యంచేస్తూ కేవలం పులివెందుల కళాశాలపై దాదాపు రూ. 400 కోట్లు ఎందుకు వ్యయంచేశారు? 5. పీపీపీ విధానంలో ప్రభుత్వ కళాశాలలకు సంబంధించిన భూములను కానీ ఇతర ఆస్తులను కానీ ప్రైవేటు భాగస్వాములకు బదలాయిస్తామని కూటమి ప్రభుత్వం ఎటువంటి ప్రతిపాదన చేయకున్నా ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నారు? 6. ప్రపంచ ప్రమాణాలతో కూడిన వైద్య కళాశాలలను స్వశక్తితో నడిచే విధంగా కాలేజీల స్థాయిలోనే ఆదాయ వనరులను కల్పించడానికంటూ సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాన్ని ప్రైవేశపెట్టి, రూ. 12 లక్షలు మరియు రూ. 20 లక్షల వార్షిక ఫీజును ప్రవేశపెట్టిన జగన్ అదే విధానంలో ముందుకు సాగనున్న పీపీపీని ఏ దురుద్దేశంతో వ్యతిరేకిస్తున్నారు? 7. జగన్ వ్యతిరేకిస్తున్నది పీపీపీనా?ప్రైవేటీకరణనునా? రెండింటినా? 8.రాష్ట్రంలో పీపీపీ విధానంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ, 108, 104, 102 సర్వీసులు, ఎమ్మారై, సిటీ స్కాన్ వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రజలకు అందించబడటం జగన్ కు తెలియదా? 9.రాష్ట్ర, దేశ వ్యాప్తంగా పీపీపీ విధానంలో లక్షలాది కోట్ల రూపాయల మేరకు రూపొందుకుంటున్న జాతీయ రహదారులు, విమానాశ్రయాలు, ఓడరేవుల అభివృద్ధిని జగన్ బహిరంగంగా వ్యతిరేకింగలరా? 10.జగన్రెడ్డి పులివెందులకు ముఖ్యమంత్రి? రాష్ట్రానికా?

**జగన్ మానసిక తీరు ఆందోళనకరం!:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ఆధీనంలో అమలవుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపట్ల జగన్ వ్యాఖ్యలను ఉదహరిస్తూ... ఆయన మానసిక సితి పట్ల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వెల్లబుచ్చారు. తాను నిత్యం వల్లివేసే అబద్దాలే... నిజాలని నమ్మే ఆయన వైఖరి... సరికాదని, దీంతో తీవ్ర పరిణామాలు ఏర్పడతాయి కనుక ఆయన వైఖరిని మార్చుకోవాలని మంత్రి సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా జగన్రెడ్డి తనకు తాను దైవదూతగాభావిస్తున్నారని మంత్రి ఆక్షేపించారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ అమలుపై జగన్రెడ్డి వ్యాఖ్యలను మంత్రి తీవ్రంగా ఖండించారు.

**నెట్ వర్క్ ఆసుపత్రుల సమస్య పరిష్కారానికి అన్వేషణ! :** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా సేవలు అందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నెట్ వర్క్ ఆసుపత్రులు ప్రభుత్వ బకాయిలు వల్ల సమస్యలు ఎదుర్కొనడం వాస్తవమేనని, అదే సమయాన రాష్ట్ర ప్రభుత్వం వనరుల సమస్య ఎదుర్కొవడం కూడా యధారమని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం మార్గాలను అన్వేషిస్తున్నామని, అందులో భాగంగా ఒక ప్రత్యామ్నాయ విధానంపై చర్చలు జరుగుతున్నాయని, ఈ ఆలోచన ఒక రూపం దాల్చిన వెంటనే వివరాలు వెల్లడిస్తామని మంత్రి అన్నారు.

# అడవులు జాతి సంపద... ప్రతి అంగుళం అమూల్యం

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడవుల రక్షణ విషయంలో మార్గదర్శకం చేస్తున్నారు. అటవీ శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులు కూడా అటవీ భూములను రక్షించే విషయంలో పకడ్బందీ వ్యూహంతో ముందుకు వెళ్లాల’ని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో అటవీ శాఖ మంత్రిగా ఉన్న వ్యక్తే తన సొంత ఇలాకాలోని అటవీ భూములను ఇష్టానుసారం ఆక్రమించుకుంటే, అప్పటి వ్యవస్థలో అధికారులు ఎందుకు మిన్నకుండిపోయారో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. అలాంటి తప్పిదాలు కూటమి ప్రభుత్వంలో జరగడానికి వీల్లేదని, పార్టీలు, వ్యక్తులకు అతీతంగా అటవీ భూమి అంగుళం కబ్జా అయినా వేగంగా స్పందించాల్సిన బాధ్యతను అటవీ అధికారులు తీసుకోవాలని చెప్పారు. కృష్ణా జిల్లా కొండపావులూరులోని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆవరణలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అటవీ అధికారుల రెండు రోజుల వర్క్ షాప్ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అడవుల సంరక్షణ, భవిష్యత్తు లక్ష్యాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ “అటవీ శాఖలో విభిన్నమైన బాధ్యతలు పంచుకోవడానికి సరిపడినంత సిబ్బంది లేరని ప్రతి సమీక్షలోనూ అధికారులు నా దృష్టికి తీసుకువస్తున్నారు. ఈ సమస్య అధిగమించడానికి ఉన్న మార్గాలను కేబినెట్ ముందు ఉంచాం. సిబ్బంది నియామకం వ్యవహారంలో పూర్తి స్థాయి పారదర్శకత పాటించాలి. ఎలాంటి సిఫార్సులకు తావివ్వవద్దు. అడవుల్ని సంరక్షించాలంటే అటవీ శాఖ అధికారుల భద్రత ప్రధానమైనది. అటవీ సిబ్బంది భద్రత పట్ల కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి స్పష్టతతో ఉంది. విధి నిర్వహణలో ఉన్న అధికారులను ఇబ్బందిపెట్టినా, దాడులకు పాల్పడినా అది ఏ స్థాయి వ్యక్తులైనా వారిని ఉపేక్షించం. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. విధి నిర్వహణలో ఇబ్బందులు ఉంటే వ్యక్తిగతంగా నన్ను కలిసి సమస్యను చెప్పండి. శ్రీశైలం ఘటన నా దృష్టికి వచ్చిన వెంటనే నిజానిజాలు తెలుసుకున్నాను. సిబ్బందికి తగిన న్యాయం జరిగేలా చూశాం. విధి నిర్వహణ విషయంలో ఎలాంటి భయాలకు తావివ్వవద్దు.

రాష్ట్రవ్యాప్తంగా 22 శాతం భూ భాగంలో నోటిఫై చేసిన అడవులు ఉన్నాయి. డి-నోటిఫై చేసిన దానితో కలిపితే మొత్తం 31 శాతంగా ఉండవచ్చు అని అంచనా. అయితే ఉన్న అడవుల్లో ఎంత పచ్చదనం ఉంది? ఆక్రమణల నేపథ్యంలో ఎంత శాతం అడవులు మిగిలాయి అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. దీనిపై సమగ్ర సర్వే చేసి ఇతర శాఖలను సమన్వయం చేసుకుని అటవీ భూములను స్వాధీనం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలి. ఆక్రమణలు ఎక్కడ ఉన్నా, చేసింది ఎవరైనా ఉపేక్షించవద్దు. 2047 నాటికి రాష్ట్ర భూ భాగంలో 50 శాతం పచ్చదనంతో నిండేలా పని చేయాలి. దీనికి ప్రజల భాగస్వామ్యం అవసరం. భావితరాలకు పచ్చదనాన్ని పెంపొందించేలా చైతన్యవంతులను చేస్తేనే లక్ష్యాన్ని చేరుకోగలం.

**గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్... గొప్ప ప్రయత్నం :** 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న రాష్ట్రం మనది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు తీర ప్రాంత రక్షణకు మడ అడవుల పెంపకం ప్రధానం. తీరం వెంబడి ఖాళీ ప్రదేశాల్లో తాటి చెట్లు, పాల్మిరా, పాడనస్ వంటి తీర ప్రాంత జాతుల మొక్కలు పునరుద్ధరణపై దృష్టి సారించి ఆకు పచ్చని గోడ నిర్మాణానికి కాల వ్యవధి పెట్టుకుని పని చేద్దాం. దీని వల్ల తీర ప్రాంతాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారికి బతుకు భరోసా లభిస్తుంది. అలాగే తుపాన్లు, సునామీల వంటి విపత్తుల నుంచి సహజ సిద్ధమైన రక్షణ పొందవచ్చు. సముద్ర జీవ జాతులను కాపాడవచ్చు. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో తీర ప్రాంతం కోతకు గురవుతోంది. సంవత్సరానికి 10 అడుగులకు పైగా సముద్ర గర్భంలో కలసిపోతుంది. ఇలాంటి కోతలను కూడా మడ అడవుల పెంపకం ద్వారా నివారించవచ్చు. గ్రేట్ గ్రీన్ వాల్ ఆంధ్రప్రదేశ్ అనేది ఒక గొప్ప ప్రయత్నంగా ప్రారంభిస్తున్నాం. దీన్ని ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి. లక్ష్యాన్ని అధిగమించేలా పనిచేయాలి.

**ఎర్రచందనం విత్తనాలు చల్లేందుకు ప్రణాళిక :** శేషాచలం అడవుల్లో 1987 ప్రాంతంలో హెలీకాప్టర్ల ద్వారా విస్తారంగా ఎర్రచందనం విత్తనాలు చల్లారు. అది రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి బీజాలు వేసింది. ఆ తర్వాత అలాంటి ప్రయత్నాలు జరగలేదు. ఇప్పుడు మరోసారి శేషాచలం అడవుల్లో ఎర్రచందనం విత్తనాలు విస్తారంగా చల్లే కార్యక్రమానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం. దీంతోపాటు ఎర్ర చందనం స్మగ్లింగ్ నిరోధంతోపాటు ఇతర రాష్ట్రాల్లో పట్టుబడుతున్న ఎర్రచందనాన్ని తిరిగి రాష్ట్రానికి రప్పించే చర్యలు తీసకుంటున్నాం. కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక వెళ్లిన సందర్భంగా ఆ రాష్ట్ర అటవీ అధికారులు మన రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుకున్న రూ. 110 కోట్ల ఎర్ర చందనాన్ని పట్టుకుని వేలం వేసుకున్నట్టు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. అందుకోసం అధునాతన సాంకేతికతను ఉపయోగించుకుని ప్రభావవంతంగా పని చేయాల్సిన అవసరం ఉంది.

**గ్రేట్ గ్రీన్ వాల్ పోస్టర్ల విడుదల :** ఈ సందర్భంగా గ్రేట్ గ్రీన్ వాల్ ప్రచార పోస్టర్లు అధికారులతో కలిసి శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఆవిష్కరించారు. అంతకు ముందు ఎన్ఐఆర్డీలోని నక్షత్ర వనాన్ని పరిశీలించి ప్రతి మొక్క వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. జమ్మి చెట్టును నాటారు. ఈ వర్క్ షాప్ లో అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే, పీసీసీఎఫ్ చలపతిరావు, అటవీ శాఖ సలహాదారు మల్లికార్జున రావు, శాఖ ఉన్నతాధికారులు రాహుల్ పాండే, శాంతిప్రియా పాండే, ఎన్ఐఆర్డీ డైరెక్టర్ శ్రీ పి.ఎస్. రెడ్డి, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌కు పోలీసుల సత్తా రానున్న రోజుల్లో తెలుస్తుంది

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ పోలీసులు అసమర్థులో సమర్థులో రానున్న రోజుల్లో చూపిస్తారని ముఖ్యమంత్రిని విమర్శించినంత మాత్రన కెటిఆర్..! మీకు గొప్పదనం రాదని వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సిఎల్‌పిలో నాయిని రాజందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉప ఎన్నికల నేపథ్యంలో ఊకదంపుడు ప్రసంగాలు చేస్తున్న కెటిఆర్ ఒక్కసారి మీ పాలన గురించి ఆలోచించు కోవాలని హితవు చెప్పారు. మా ముఖ్యమంత్రి సమర్థతో ఏంటో మీ కుటుంబం మొత్తం చూసిందని వివరించారు. మీ పాలనలో ఎమ్మెల్యేలను, మంత్రులను ఏ మేరకు గౌరవించారో ప్రజలు గమనించారని అన్నారు. దళిత నాయకుడు అని చూడకుండా ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలిగిస్తే సొంత పార్టీ దళిత నేతలు మాట్లాడిన దాఖ లాలు లేవని గత చరిత్రను గుర్తుచేశారు..సమర్థులైన అధికారులను పక్కనపెట్టి రిటైర్డ్ అధికారూలతో పాలన చేసిర్రు అని విమర్శించారు.నీ సొంత చెల్లె మీ అవినీతి బాగోతలను బయటడితే మాట్లాడిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు.మీ మాటలను తెలంగాణ సమాజం అసహించుకుంటుంది అని ఆయన అన్నారు. మా ముఖ్యమంత్రిని విమర్శిస్తే గొప్పోడిని అవుతానసుకోవడం నీ అవివేకమని అన్నారు.

## సామాజికం, ఆర్థికంగా తెలంగాణ బలోపేతానికి ముఖ్యమంత్రి కృషి

### ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** సామాజికంగా ఆర్థికంగా తెలంగాణను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారని కెసిఆర్ పాలనలోనే తెలంగాణ వెనుకకు నెట్టివేయబడిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కెటిఆర్‌పై తీవ్రంగా ధ్వజ మెత్తుతూ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ 'కేసీఆర్ అధికారంలోకి వస్తే తెలంగాణ నేపాల్, బంగ్లాదేశ్ అయ్యేది' అని స్పందించారు. కేసీఆర్ తెలంగాణను సర్వ నాశనం చేయాలనుకున్నారని ఆయన దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ తెలంగాణనుఆర్థికంగా, సామాజికంగా మెరుగు పరుస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌పై కెసిఆర్ చేస్తున్న విమర్శలను ప్రజలు పట్టించుకోరు బిఆర్ఎస్ నాయకులు కాలకేయుల్లాగా దాడి చేస్తున్నారని అన్నారు.

## 30 నుంచి ఎస్ఎస్‌సి పరీక్ష ఫీజు స్వీకరణ

### నవంబరు 13 తుది గడువు

### అపరాధ రుసుంతో డిసెంబరు 29 వరకు అవకాశం

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 2025-26 విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో చేరిన విద్యార్థులకు సంబంధించి వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న వార్షిక పరీక్షలకు సంబంధించిన ఫీజు షెడ్యూల్‌నను ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ శ్రీహరి గురువారం విడుదల చేశారు. ఈ నెల 30 నుంచి పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు తెలిపారు. నవంబరు 13 వరకు అపరాధ రుసుం లేకుండా ఫీజును స్వీకరించనున్నట్టు ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ. 50తో నవంబరు 15 నుంచి 29 వరకు, రూ. 200తో డిసెంబరు 2 నుంచి 11 వరకు, అపరాధ రుసుం రూ. 500తో డిసెంబరు 15 నుంచి 29 వరకు స్వీకరించనున్నట్టు ప్రకటించారు.విద్యార్థుల డేటాను నవంబరు 18 లోపు పాఠశాల ప్రధానోపాధ్యాయులు(హెచ్‌ఎం), జిల్లా విద్యాధికారి(డీఈవో)లకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు రూ. 125 ఫీజుగా నిర్ణయించారు. మూడు సబ్జెక్టుల వరకు రూ. 110, మూడు సబ్జెక్టుల కంటే ఎక్కువ అయితే రూ. 125 చెల్లించాలని పేర్కొన్నారు. ఒకేషనల్ విద్యార్థులు పరీక్ష ఫీజుకు అదనంగా రూ. 60 చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## సిపిజెట్ రెండో విడతలో సీట్లు పొందిన వారు కాలెజీల్లో చేరాలి

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్(పిజి) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలు(సిపిజెట్)-2025 కౌన్సెలింగ్‌లో భాగంగా రెండో విడత సీట్ల కేటాయింపును మంగళవారం రాత్రి చేపట్టారు. సీట్లు పొందిన వారు ఆయా కాలేజీల్లో చేరడానికి నేడు (శుక్రవారం) తుదిగడువుగా ప్రకటించారు. ఒరిజినల్ టిసి ఇచ్చి సీటు పొందిన కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు. 2025-2026 విద్యా సంవత్సరానికి పిజి మొదటి సంవత్సరంలో చేరడానికి రెండో విడతలో 20,161 మంది వెబ్ ఆప్షన్లు ఇవ్వగా వారిలో 11,289 మందికి సీట్ల కేటాయింపు చేశారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, పాలమూరు, మహాత్మా గాంధీ, శాతవాహన, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాల క్యాంపస్, కాన్‌స్టిట్యూషనల్, అనుబంధ కళాశాలల క్యాంపస్‌లలో పిజి కోర్సులలో ప్రవేశాల కోసం సిపిగెట్-2025ను నిర్వహించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా మొదటి దశలో 28,145 మంది వెబ్ ఆప్షన్లు చేయగా.. వారిలో 20467 మందికి సీట్లు కేటాయించబడ్డాయి. రెండో విడత సీట్ల కేటాయింపును మంగళవారం చేపట్టిన విషయం తెలిసిందే.

# పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

### మనోధైర్యం కోల్పోకుండా శాంతిభద్రతలు రక్షించండి

### ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శించి రెండు లక్షల పరిహారంప్రకటించిన పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని మనోధైర్యం కోల్పోకుండా శాంత్రిభద్రతలను పరిరక్షించాలని ప్రభుత్వం మీకు అన్ని విధాలుగా అండగా వుంటుందని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పిలుపునిచ్చారు. గురువారం నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబాన్ని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పరామర్శించారు.నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ తరఫున రెండు లక్షల రూపాయలు షబ్బీర్ అలీ మహేష్ కుమార్ గౌడ్ అందించారు. ప్రభుత్వం తరఫున కోటి రూపాయలు పరిహారం కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం నిజామాబాద్ పట్టణంలో 300 గజాల ఇంటి స్థలం అందిస్తున్నదని వారు తెలిపారు. ఆర్థికంగా సహాయం చేయగలం కానీ వారి కుటుంబానికి మానసికంగా జరిగిన గాయాన్ని ఎవరు పూడ్చలేమని మహేష్‌కుమార్ అన్నారు. ప్రమోద్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటా మని తెలిపారు. నిజామాబాద్‌లో రౌడీషీటర్ దాడిలో వీరమరణం పొందిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుం బానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందిరాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పోలీసు వర్గాల్లో కొంతమేర ఉపశమనం కలిగించింది.ప్రమోద్ చేసిన సేవలు మరువలేనివని, ఆయన త్యాగం పోలీసు శాఖ గౌరవాన్ని పెంచి ప్రజల్లో పోలీసుల పట్ల గౌరవం పెరిగింది పోలీస్ శాఖ సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఆయన హామీ ఇచ్చారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు నివారించేందుకు పోలీసులకు ప్రభుత్వం నైతిక బలం అందిస్తుంది. ప్రమోద్ కుటుంబానికి అందించే ఈ సాయం ఆయన చేసిన సేవలకు ప్రభుత్వ గౌరవ సూచకమని, ఇది పోలీసు శాఖలో ప్రతి సభ్యుడికి ప్రేరణగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రమోద్ త్యాగం పోలీసు వ్యవస్థలో కర్తవ్యనిష్ఠకు ప్రతీకగా నిలిచిపోతుందని ఆయన కొనియాడారు.

**కుటుంబ తగాదాలు పరిష్కరించుకోలేక మాపై కెటిఆర్ విమర్శలు: మహేష్‌కుమార్**

పదేళ్ల బిఆర్ఎస్ నిరంకుశ పాలనను ప్రజలు మరిచిపోలేదని బిఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మె పరిస్థితిలో లేరని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం నిజామాబాద్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కుటుంబ తగాదాలు పరిష్కరించుకోలేని కెటిఆర్ మాపై విమర్శలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కవిత మాటాలకు సమాధానం చెప్పు అని నిలదీశారు. జూబ్లిహిల్స్ ఉప ఎన్నికలలలో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు మానసికంగా సిద్ధమైనారని గెలుపు ఇక లాంఛనమేనని ఆయన ఖరాఖండిగా తన అభిప్రాయం వ్యక్తంచేశారు. అధికారంలో ఉండగా బిఆర్ఎస్ అనేక అరాచకాలు చేసిందని అందుకే అసెంబ్లీలో ఓడించారిన పార్లమెంట్‌లో సున్నాసీట్లు వచ్చాయని రేపు జూబ్లీలోకూడా సున్నారాబోతుందని జోస్యంచెప్పారు. జూబ్లిహిల్స్ ప్రజలు బిఆర్ఎస్‌కు కర్రుకాసి వాత పెడుతారని ఆయన అన్నారు. బిఆర్ఎస్ చెప్పుకోదగ్గ ఏదైనా కార్యక్రమం చేసిందా అని ఆయన అడిగారు. ప్రభుత్వం అన్ని ప్రాంతాలను సమానంగా చూస్తోందని నిజామాబాద్ అభివృద్ధి వేగవంతం చేస్తామని తెలిపారు. రైల్వే ఓవర్ బ్రిడ్జికోసం కేంద్రం నిధులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు.,కవిత పాదయాత్రను స్వాగతిస్తున్నామని ప్రజాస్వామ్యంలో ఎవరు పాదయాత్ర చేసినా స్వాగతించాలని అన్నారు. పదేళ్ళు తెలంగాణలో దోచుకున్న ముఠాలో కవిత ఉన్నారని కేబినెట్‌లో మైనార్టీలకు అవకాశం త్వరలో ఉంటుందని చెప్పారు.

## చిన్నరైతుల మేలు కోసం కొత్త వ్యవసాయ విధానం అవసరం

### వ్యవసాయ వర్సిటీ ఉపకులపతి పనితీరు అద్భుతం: ప్రొ. కోదండరాం

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయమే మూలం: గోరటి వెంకన్న



వర్సిటీ ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ కోదండరాం, ఉపకులపతి జానయ్య, ఆకునూరు మురళి, గోరేటి వెంకన్న తదితరులు

**హైదరాబాద్ (అత్తాపూర్), అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం గురువారం రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతిగా యేడాది పూర్తి చేసుకున్న ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను అభినందించారు. యేడాది ప్రగతి నివేదికను విడుదల చేసి విడియోను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఎం. కోదండరాం హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమానికి, రైతాంగం, వ్యవసాయ రంగానికి విడదీయరాని సంబంధం ఉందని కోదండరాం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ రంగం తీవ్రసంక్షోభంలో ఉండేదన్నారు. స్వ రాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకొని విధానాలు రూపొందించాలని అన్నారు. ఈ నేపథ్యంలో రైతాంగానికి సరైన సూచనలు, సలహాలు ఇస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థని గాడిన పెట్టవలసిన గురుతర బాధ్యత వర్సిటీపై ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతర సూచనలు, సలహాల తోనే తాను విశ్వవిద్యాలయాన్ని నడిపి స్తున్నానని జానయ్య అన్నారు. మేధస్సే పెట్టుబడిగా విశవిద్యాలయ ఖ్యాతిని పెంచడానికి జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు వివరించారు. ప్రత్యేక సాయంగా 450 కోట్ల రూపాయలు ఇవ్వవల సిందిగా కేంద్ర ఆర్థిక మంత్రికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసు కెళ్లినట్లు చెప్పారు. తమ ఎంపీ ల ద్వారా కేంద్రం నుంచి నిధులు రప్పించేందుకు ప్రయత్నం చేస్తామని సీఎం హామీ ఇచ్చారని జానయ్య వివరించారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరం నుండి ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, నిజా మాబాద్‌లో 30 సీట్ల చొప్పున మూడు కళాశాలని ప్రారంభిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని జానయ్య నిలుపుకున్నారని తెలంగాణ విద్యా కమిషన్ చైర్ పర్సన్ ఆకునూరి మురళి అన్నారు. గత యేడాది కాలంలో ఆయన అద్భుతాలు సృష్టించారన్నారు. జానయ్య ఆధ్వర్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం మంచి ప్రగతి కనబరుస్తుందని గాయకుడు, కవి ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న అన్నారు. సమాజానికి వెన్నెముకైన వ్యవసాయ రంగానికి చేదోడు వాదోడుగా నిరంతరం ఉండాలని ఆయన విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలకి, విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సి హెచ్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ అధికారులు, రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సంపత్ కుమార్, సాయికుమార్, సంతోష్‌కుమార్, బోధన, బోధనేతర ఉద్యోగసంఘాల నాయకులు డాక్టర్ పవన్ చంద్రారెడ్డి, శ్రీనివాస్ యాదవ్‌తో పాటు డాక్టర్ వాసుదేవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వారిని సత్కరించారు.

## కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

### టూరిజం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** టూరిజం శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తెలంగాణ టూరిజం కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. టూరిజం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరి క్రాంతి, ఇ.డీ. ఉపేందర్ రెడ్డి, జి.ఎం. మానవి జగన్లకి చాడ వెంకటరెడ్డి నేతృత్వంలోని యూనియన్ ప్రతినిధి బృందం గురువారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని గతంలోనే సంస్థ యాజమాన్యాన్ని కోరామని నేటికి అమలు చేయకపోవడంతో అమలు చేయాలని గుర్తుచేశామన్నారు. ఉద్యోగాల క్రమబద్ధీకరణ చేయలేమని యాజమాన్యం చెబుతోందని, పెంచిన జీతాలు మాత్రం ఈ నెల నుంచే ఇస్తామన్నారని చాడ అన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమోళి, మౌలాలి, గోపి, నాజర్పల్లి, రాజయ్య, భగవాన్ దాసు, మాధురారెడ్డి, మృదుల, నేత్ర, ఆలియా, రమాదేవి, చైతన్య, రమేష్బాబు, బల్వేర్ ప్రసాద్, సతీష్, మొజిద్, విజయ్, రాజ్కుమార్, రవి, నాగరాజు, శ్రీధర్, యాదవ్, శ్రీశైలం, రషీద్, పాల్గొన్నారు.



అత్యాధునిక వైద్యపరికరాలను ప్రారంభించిన నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప, చిత్రంలో వైద్యులు, సిబ్బంది

## నిమ్స్ ఆసుపత్రిలో అందుబాటులోకి అత్యాధునిక వైద్యపరికరాలు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. రూ. 2కోట్ల విలువైన ఈ వైద్య పరికరాలను నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప గురువారం ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా సిస్టమ్ మినిమల్ ఇన్వేసివ్ శస్త్రచికిత్సల విషయంలోఖచ్చితమైన, సురక్షితమైన శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు కార్ల్ స్టోర్జ్ 4కె టీఎల్-400 రుబినా లాప్రో స్కోపిక్ టవర్ విత్ ఐసీజీ, అత్యుత్తమ చిత్రనాణ్యతను అందించే ఒలంపస్ సీవీ-170 ఎండోస్కోపీ, కొలోనోస్కోపీ సిస్టం పరికరాలను అందుబాటులోకి తీసు కొచ్చినట్లు వివరించారు. ఈ పరికరాల ద్వారా అధునాతన సాంకేతికతను వినియోగించే అవకాశం కలుగుతుందని, రోగనిర్ధారణ, చికిత్సలో, భద్రత, సమర్థత మరింతగా పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్యాస్ట్రో విభాగ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పదవీవిరమణ పొందిన ప్రభుత్వోద్యోగుల బకాయిలను విడుదల చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని లేఖ

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను విడుదల చేయాలని కోరుతూ సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం లేఖ రాశారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేఖలో కోరారు. రాష్ట్రంలో మార్చి 2024 నుండి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు.. ఇప్పటికీ 18 నెలలు గడిస్తున్నా వారి బకాయిలను విడుదల చేయలేదన్నారు. పదవీ విరమణ పొందిన వారు సుమారు 12 వేల మంది ఉన్నారని వారికి ఇప్పటి వరకు ఎటువంటి పదవీ విరమణ బకాయిలు అందలేదన్నారు. పదవీ విరమణ బకాయిలు అందకపోవడంతో ఉద్యోగుల కుటుంబాల ఆర్థిక పరిస్థితి చాలా దయనీయంగా మారిందన్నారు. కుటుంబ బాధ్యతలు ఏవి తీర్చలేని పరిస్థితిలోకి నెట్టబడ్డారని, బకాయిలు విడుదల చేయకపోవడంతో మానసిక ఆందోళనలు తట్టుకోలేక రాష్ట్రంలో కొన్ని మరణాలు కూడా సంభవించాయని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో కూనంనేని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పి. సీతారామ రాజు, మండల పంచాయితి అధికారి, అశ్వారావుపేటలో పదవీ విరమణ పొంది ఈ ఏడాది సెప్టెంబర్ 3న మానసిక వేదనతో మరణించడం జరిగిందని గుర్తు చేశారు. అదే విధంగా రాష్ట్ర వ్యాపితంగా చాలా మంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వృద్ధాప్యంలో వారికి రావాల్సిన బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని.. కావున పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు వెంటనే విడుదల చేసి ఆదుకోవాల్సిందిగా తమరిని ప్రత్యేకంగా కోరుతున్నానని లేఖలో కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు.

## బిఆర్ఎస్‌పై ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ విసుర్లు

## ప్రగతిభవన్ గడీలా మార్చి ప్రజాస్వామ్యం అపహాస్యం

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు స్టువర్టు పురం దొంగల్లా తెలంగాణను దోచుకున్నారు.. ప్రగతిభవన్ గడీ కట్టుకుని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తు పాలన చేశారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ విమర్శించారు. గురువారం సిఎల్‌పిలో ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలను కరివేపాకు అంటే హీనంగా చూసిన బతకులు మీవి అని నిందించారు. మీలా కారణం చెప్పకుండా దళిత డిప్యూటీ సిఎం ని బర్తరఫ్ చేసి పైశాచిక ఆనందం మా సిఎం రేవంత్‌రెడ్డి పొందలేదు.ప్రతి మంత్రితో గౌరవంగా చర్చలు జరుపుతారు మా ముఖ్యమంత్రి, నువ్వెన్ని పెడబొబ్బలు పెట్టినా ఏం ఉపయోగం లేదు కేటిఆర్ అని సమాధానం ఆది శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు. మా ముఖ్యమంత్రి పైన పిచ్చి పిచ్చి గా వాగినంత మాత్రం నువ్వు పెద్ద మొగోడివి కాలేవు, నీ బతుకు, నీ అయ్య బతుకు ఏమిటో ఇప్పటికే తెలంగాణ ప్రజలు తేల్చారని ఎద్దేవా చేశారు మా ముఖ్యమంత్రి అందరు మంత్రులు, ప్రజాప్రతినిధులను గౌరవిస్తున్నారని మీలాగా గేటు దగ్గర అవమానించి పంపడం లేదని ఆయన వివరించారు. మా ముఖ్యమంత్రి వేదికల పైన మంత్రులను ఈసడించుకోలేదు, ఈకముక్కలా తీసిపారేయలేదు అవినీతి సొమ్ములో వాటా అడిగిన సొంత బిడ్డను పార్టీ నుంచి గెంటివేసిన చరిత్ర మీది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉదారతను చాటిచెప్పే ప్రయ్నం విప్ చేశారు. పదేళ్ల అధికారంలో అనేక మంది నిజాయితీ పరులైన ఐఎఎస్ ,ఐపిఎస్ అధికారులకు ఫోస్టింగ్ లు ఇవ్వకుండా పక్కన పెట్టింది మరిచి పోయారా..?అని ఆయన కెటిఆర్‌ను నిలదీశారు. రిటైర్డ్ అధికారులతో రాజ్యం నడిపిన విషయాలు గుర్తుకు రావడం లేదా..? అని కెటిఆర్‌ను ఆది ప్రశ్నించారు.

## విఓఎలకు వేతనాలు పెంచాలి

### సమస్యలు పరిష్కరించేదాకా అండగా ఉంటాం

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్ (ధర్నాచౌక్), అక్టోబరు24(జర్నలిస్ట్ ఫైల్) :** విఓఎలకు తక్షణమే వేతనాలు 8 వేల నుంచి 26 వేలకు పెంచాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో విఓఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఐకేపీ విఓఎ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో మేము అధికారంలోకి వస్తే విఓఎల వేతనాలు 26 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అసలు అధికారంలోకి వస్తామనే నమ్మకం కాంగ్రెస్‌కు లేదని, అందుకే ఇష్టానుసారం హామీలు ఇచ్చారని, అనుకోకుండా తప్పుదారిన అధికారంలోకి వచ్చారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రికి సోనియమ్మ తప్ప తెలంగాణ సోయి లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలు గుర్తులేవని విమర్శించారు. విఓఎ అక్కాచెల్లెళ్ల భయం భయంగా ఆందోళన చేయాల్సిన అవసరం లేదని, జీతం పెంచమని వేడు కోవల్సిన అవసరం లేదని, ఇచ్చిన హామీ ప్రకారం జీతం పెంచాలని పిడికిలెత్తి డిమాండ్ చేయాల్సిందేనన్నారు. విఓఎ ఆడబిడ్డలను ఇబ్బంది పెడితే ఊరుకో బోమని, వారి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు జాగృతి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో తెలంగాణ ఐకేపీ విఓఏ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారిపెల్లి మాధవి, ప్రధాన కార్యదర్శి పట్టూరి తిరుపతి, ఏర్పుల నర్సింలు, ఎం.డి.మోహినొద్దీన్, విఓఎలు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో బిసి బిల్లుకు ప్రధానిపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఒత్తిడి తేవాలి

### త్వరలో వారికి వినతిపత్రాలు ఇస్తాం: ఎంపి ఆర్.కృష్ణయ్య

### ఎపి బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గం తీర్మానం



అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో ఎపి బిసి నేతలు వై.నాగేశ్వర్‌రావు, వై.నూకాలమ్మ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంట్‌లో బిసి బిల్లును ప్రవేశపెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లను కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం, జిల్లాల అధ్యక్షుల సమావేశంలో ఎపి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇందుకోసం ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం కొణిదల పవన్‌కళ్యాణ్ అఖిల పక్షాన్ని, బిసి నాయకులను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాన మంత్రి నరేంద్రమోదీపై వత్తిడి తీసుకు రావాలని కార్యవర్గం కోరింది. త్వరలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్య క్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం సిఎం, డిసిఎంను కలిసి విజ్ఞప్తి చేస్తామని కార్య వర్గం తెలిపింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ బిసిల పక్షాన నిలబడి పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టిస్తే చరిత్రలో నిలిచిపోతారని, ఈ బిల్లు నరే ంద్రమోదీ వల్లనే సాధ్యమవుతుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం బిసిల డిమాండ్లు, అభివృద్ధి విషయంలో తీవ్రంగా కృషి చేస్తున్నదని బిసిలకు చరిత్రలో నిలిచిపోయే విధంగా చారిత్రాత్మకమైన నిర్ణయాలను తీసుకుంటున్నదని, గత ప్రభుత్వాలు జనగణనలో కులగణన చేపట్టాలని ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని, కాని బిజెపి ప్రభుత్వం జనగణనలో కులగణన చేపట్టాలని చారిత్రాత్మకమైన నిర్ణయిం తీసుకుందని ఆయన గుర్తుచేశారు. సమావేశానికి ఎపి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు వై. నాగేశ్వర్‌రావు, ఇన్‌చార్జి వై.నూకాలమ్మ అధ్యక్షత వహించగా బిసి నాయకులు అనంతయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య పలువురు ఆంధ్రప్రదేశ్ నాయకులను వివిధ పదవుల్లో నియమించారు.

## బిసి బిడ్డను రౌడిషీటర్‌గా అవమానించడం అగ్రవర్ణకుల దురహంకారం

### నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** బిసి బిడ్డను రౌడీ షీటర్ అని అవమా నించడం బిఆర్ఎస్ అగ్రవర్ణ దురహంకారంకు నిదర్శనమని నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బిసిల ఆత్మ గౌరవంపైన దాడిగా ఆయన అభివర్ణించారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ మంచి విద్యావంతులు, పేదలకు సహాయం చేసే గుణం ఉన్నవాడని ఆయన కొనియాడారు. ఆయనపై నీ అగ్రవర్ణ అహంకారాన్ని చూపిస్తావా అని కెసిఆర్‌పై ఎంపీ మల్లు రవి ఆగ్రహంవ్యక్తంచేశారు. నవీన్‌యాదవ్‌పైన కెసిఆర్ మాటలు సమస్త బిసిలకు అవమానపరిచినట్టే అని ఆయన అన్నారు. ఇది బిసి సమాజం గుర్తించాలని ఆయన సూచించారు.
జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ బిసిని నిలబడితే అతను గెలుస్తారు అని టాక్ రావడంతో బెంబేలెత్తుతున్న కెసిఆర్ ఇలా ప్రకటించారని అన్నారు..కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం ఒక బిసి బిడ్డకు టికెట్ ఇస్తే మీరు అగ్రవర్ణాలకు అందులో వలసవచ్చిన వారికి టికెట్ ఇచ్చి బిసిలపై విషం కక్కుతున్నావుమీరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయాన్ని ఎవరు ఆపలేరని మల్లు రవి జోస్యం చెప్పారు.

## ఇంటర్ విద్యార్థుల నుంచి రూ. 235 వసూలు

### నెలాఖరు వరకు బోర్డుకు చెల్లించాలి: కృష్ణఆదిత్య

**హైదరాబాద్, అక్టోబరు 24 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల నుంచి రూ. 235 వసూలు చేయనున్నారు. గుర్తింపు ఫీజుతోపాటు గ్రీన్ ఫండ్ పేరుతో విద్యార్థుల నుంచి వసూలు చేయాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశాలు ఇచ్చారు. అందులో రూ. 220 గుర్తింపు ఫీజుగా, రూ. 15 గ్రీన్ ఫండ్‌గా వసూలు చేయాలని సూచించారు. అయితే ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు ఇందులో నుంచి మినహాయింపు ఇస్తున్నట్టు ఉత్తర్వులో పేర్కొన్నారు. ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో చేరిన ప్రతి విద్యార్థి నుంచి ఈ రెండు ఫీజులను వసూలు చేసి నేటి(శుక్రవారం) నుంచి ఈ నెలాఖరు(అక్టోబరు 31) నాటికి ఇంటర్ బోర్డు అకౌంట్‌లో ఆన్‌లైన్ ద్వారా ప్రిన్సిపాల్స్ చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



## మహాఘట్‌బంధన్ సిఎం
# అభ్యర్థిగా తేజస్వి యాదవ్

- ఉప ముఖ్యమంత్రిగా ముఖేశ్ సహాని
- పేర్లు ప్రకటించిన కాంగ్రెస్ నేత అశోక్ గెహ్లాట్

**పాట్నా, అక్టోబరు 24 :** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆర్‌జెడి అగ్రనేత తేజస్వి యాదవ్‌ను మహాఘట్‌బంధన్ ప్రకటించింది. అలాగే ఉపముఖ్యమంత్రి అభ్యర్థిగా కూటమికి చెందిన వికాస్ శీల్ ఇన్సాన్ పార్టీ(విఎస్‌పి) అధినేత ముఖేశ్ సహాని పేరును వెల్లడించింది. గురువారం పట్నాలో నిర్వహించిన సమావేశంలో మహాఘట్‌బంధన్ పార్టీల నేతలు హాజరయ్యారు. కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థిపై ఏకాభిప్రాయానికి వచ్చి తేజస్వి పేరును ఖరారు చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ ప్రకటించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తమతో పాటు ఉన్న నేతలంతా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అశోక్ గెహ్లాట్ ప్రకటించారు. అనంతరం తేజస్వి యాదవ్ మాట్లాడుతూ... 'ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కాదు, బీహార్ అభివృద్ధి కోసం చేతులు కలిపాం. అవినీతి, నేరం అనే ఎన్ డీఏ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి కలిసి పనిచేస్తాం. తమకు బీహార్ ప్రజలు 20 నెలలు అవకాశమిస్తే, 20 నెలల్లోనే 20 సంవత్సరాలలో చేయని పనిని పూర్తి చేస్తాం' స్పష్టం చేశారు. ప్రస్తుతం తేజస్వి యాదవ్ బీహార్ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. గతంలో ఉపముఖ్యమమంత్రిగా పనిచేశారు. మహాఘట్‌బంధన్‌లో విభేదాల నేపథ్యంలో కొన్ని స్థానాల్లో ఆర్‌జెడి, కాంగ్రెస్ పరస్పరం పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ 61 స్థానాల్లో పోటీ చేయగా, ఆర్‌జెడి 143 మంది అభ్యర్థులను ప్రకటించింది. ఈ పరిణామంతో కూటమిలో చీలిక వచ్చిందనే వార్తలకు బలం చేకూర్చినట్లు అయ్యింది. ఈ క్రమంలో ఇరు పక్షాలు సమావేశమై తేజస్వి యాదవ్ పేరు ఖరారు చేశాయి.

# హెచ్-1బి వీసాపై లక్ష డాలర్ల ఫీజు తొలగించండి

## అమెరికా చట్టసభ సభ్యుల లేఖ




**వాషింగ్టన్, అక్టోబరు 24 :** హెచ్-1బి వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై సొంత దేశంలోనే వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తాజాగా ఈ ఫీజు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలంటూ అమెరికా చట్టసభ సభ్యులు ట్రంప్, వాణిజ్య మంత్రి లుట్నిక్‌కు లేఖ రాశారు. డెమోక్రాట్లు, రిపబ్లికన్ పార్టీలకు చెందిన ఏడుగురు చట్టసభ సభ్యులు ఈ లేఖ రాశారు. హెచ్-1బి వీసా ఫీజును పెంచడం వల్ల ఆ వీసా దుర్వినియోగం ఏమాత్రం ఆగదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి బదులుగా అమెరికాలోని స్టార్టప్ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడుతోందని, ఆవిష్కరణలు తగ్గిపోతాయని పేర్కొన్నారు. దీని కారణంగా భారత్‌తో సహా అనేక దేశాల నుంచి వచ్చిన నైపుణ్యం కలిగటిన వ్యక్తులను కోల్పోవాల్సి ఉంటుందన్నారు. హెచ్-1బి వీసా దుర్వినియోగం కాకుండా మార్పులు అవసరమని తాము కూడా భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, ఫీజు పెంచడం అనేది సరైన చర్య కాదన్నారు. ఇది ప్రతికూలమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. పెద్ద కంపెనీలు ఈ మొత్తాన్ని భరించగలిగినప్పటికీ.. చిన్న కంపెనీలు ఆ వీసా అభ్యర్థుల నియామకాలను నిలిపి వేసుకోవాల్సి వస్తోందన్నారు. ఇదే క్రమంలో ప్రాజెక్టులు కూడా విదేశాలకు తరలి పోతాయన్నారు. అధిక నైపుణ్యం కలిగిన వలసదారులు చరిత్రాత్మకంగా అమెరికాకు బలమని వ్యాఖ్యానించారు. అమెరికన్ల స్థానంలో తక్కువ జీతంతో విదేశీయులను నియమించుకునే అవుట్‌సోర్సింగ్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. అధిక నైపుణ్యం కలిగిన వలసదారులు మన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో సహా అమెరికా పౌరులకు అవకాశాలను విస్తరించ డంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా వ్యవస్థను ఆధునికీకరించేందుకు అధ్యక్షుడు ట్రంప్ కాంగ్రెస్‌తో కలిసి పని చేయాలని అభ్యర్థించారు. హెచ్-1బి వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ చేసిన ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, హెచ్-1బి వీసాపై వన్‌టైమ్ ఫీజు అని వైట్‌హౌస్ ఆ తర్వాత స్పష్టతనిచ్చింది. ఇక, వీసా ఫీజు పెంపుపై అమెరికా ఛాంబర్ ఆఫ్ కామర్స్ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నేపథ్యంలో.. ట్రంప్ సర్కారు మార్గదర్శకాలు జారీ చేసింది. దాని ప్రకారం.. విదేశాల నుంచి నేరుగా హెచ్-1బి వీసాలకు దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే లక్ష డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది.

# దమ్ముంటే మమ్మల్ని ఎదుర్కో

## పాక్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌కు టిటిపి హెచ్చరికలు!



**ఇస్లామాబాద్, అక్టోబరు 24 :** తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) ఉగ్రవాదులు ఒకవైపు.. అఫ్ఘానిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు మరోవైపు పాకిస్థాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇప్పుడు టిటిపి పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్‌ను హెచ్చరించింది. దమ్ముంటే తమను ఎదుర్కోవాలని సవాల్ విసురుతూ విడియోలు విడుదల చేసింది. తమ మీదకు సిపాయిలను పంపించడం మానేసి.. ఉన్నతాధికారులే యుద్ధభూమికి రావాలని వ్యాఖ్యలు చేసింది. అలాగే ఈ నెల 8న ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో దాడి జరిపిన దృశ్యాలను విడుదల చేసింది. ఒక విడియోలో కనిపించిన కమాండర్ పేరు కాజిమ్ అని పాక్ అధికారులు వెల్లడించారు. 'దమ్ముంటే మమ్మల్ని ఎదుర్కో' అని అందులో మునీర్‌ను హెచ్చరించాడు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా తీసుకున్న పాక్ అధికారులు కాజిమ్ తలపై 10 కోట్ల పాకిస్థానీ రూపాయల రివార్డు ప్రకటించారు. అతడి గురించి సమాచారం ఇచ్చిన వారికి ఆ మొత్తం ఇస్తామని వెల్లడించింది. తన భూభాగాన్ని ఉపయోగించుకుంటున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) ఉగ్రవాదులపై అఫ్ఘానిస్థాన్ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

సరిహద్దుల్లో దాడులకు పాల్పడే ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారనే ఆరోపణలను అఫ్ఘాన్ ఖండించింది. ఆ అంశమే ఇరుదేశాల మధ్య తీవ్ర ఘర్షణలకు దారితీసింది. ఉగ్రవాదుల ఏరివేత పేరుతో ఇటీవల పాక్ చేసిన దాడులపై అఫ్ఘాన్ ప్రతీకార దాడులు చేసింది. కొన్ని రోజుల పాటు జరిగిన ఘర్షణలకు ఖతార్ రాజధాని దోహాలో ముగింపు పడింది. రెండు దఫాలుగా జరిగిన చర్చల్లో శాశ్వత శాంతి, స్థిరత్వం కోసం ఇరు దేశాలు తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని ఖతార్ విదేశాంగ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే.

# ఆసియాన్ సదస్సుకు వెళ్లని ప్రధాని

## వర్చువల్‌గా పాల్గొంటా: మోడీ

### ట్రంప్, మోడీ భేటీ లేనట్లే ..

### భారత్ ప్రతినిధిగా హాజరుకానున్న జైశంకర్



**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** కౌలాలంపూర్‌లో ఈ నెల 26 నుంచి జరుగనున్న 22వ ఆసియాన్ శిఖరాగ్ర సదస్సుకు తాను వెళ్లడం లేదు. వర్చువల్‌గా హాజరవుతున్నట్లు ప్రధాని మోడీ స్వయంగా ప్రకటించారు. ఆసియాన్- భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఈ సదస్సు నేపథ్యంలో మలేషియాతోపాటూ కంబోడియాలో కూడా ప్రధాని పర్యటించాలని తొలుత భావించారు. అయితే, తాజాగా ఆయన ఈ సదస్సుకు వెళ్లకపోవడంతో.. కంబోడియా పర్యటన కూడా వాయిదా పడింది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సహా అనేక దేశాల నాయకులు హాజరుకానున్నారు. ప్రధాని మోడీ గైర్హాజరు నేపథ్యంలో ట్రంప్ - మోడీ భేటీ ఈసారి కూడా లేనట్లే. ఈ ఆసియాన్‌లో మలేసియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, మయన్మార్ వంటి 10 దేశాలు సభ్యదేశాలుగా ఉన్నాయి. ప్రధాని మోడీ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ మలేసియా వెళ్తారని, ఆసియాన్ శిఖరాగ్ర సమావేశాల్లో భారత్ తరఫున జైశంకర్ ప్రాతినిధ్యం వహిస్తారని ఈ మేరకు మలేసియాకు న్యూఢిల్లీ సమాచారం ఇచ్చింది. తాజాగా మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో ఫోన్‌లో ప్రధాని మోడీ సంభాషించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. "నా ప్రియమైన స్నేహితుడు మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంతో హృదయపూర్వక సంభాషణ జరిగింది. మలేసియా ఆసియాన్ అధ్యక్షత వహించినందుకు ఆయనకు అభినందనలు.. ఆసియాన్ - భారత్ శిఖరాగ్ర సమావేశంలో వర్చువల్‌గా పాల్గొనడానికి, ఆసియాన్- భారత్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింతగా బలోపేతం చేయడానికి ఎదురుచూస్తున్నాను" అని ప్రధాని మోడీ ట్వీట్ చేశారు. ఇక ఆసియాన్ శిఖరాగ్ర సదస్సుకు ప్రధాని మోడీ వెళ్లకపోవడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఆ సదస్సుకు ట్రంప్ రావడంతోనే మోడీ వెళ్లడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ విమర్శలు గుప్పించారు. ట్రంప్ నుంచి తప్పించుకునేందుకే ఈ సమావేశానికి వెళ్లడం లేదంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు జైరాం రమేష్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డిఏ అభ్యర్థుల తరఫున ప్రధానమంత్రి నరేంద్రమోడీ శుక్రవారం నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న కర్పూరి ఠాకూర్ స్వస్థలం సమస్తిపూర్ నుంచే మోడీ ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. సమస్తిపూర్‌లో ప్రధాని మోడీ తొలుత కర్పూరి ఠాకూర్‌కు నివాళి అర్పించి, అనంతరం సమస్తిపూర్, బెగుసరాయ్‌లలో ఎన్నికల ర్యాలీలు చేపట్టనున్నారని బిజెపి బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ జైస్వాల్ వెల్లడించారు.

# 'వికాసానికి' 'వినాశనానికి' మధ్య పోరు

### బీహార్ ఎన్నికలపై కేంద్ర మంత్రి జెపి నడ్డా తీవ్ర వ్యాఖ్యలు!

**పాట్నా, అక్టోబరు 24 :** బీహార్ ఎన్నికలను ఎన్డీయే 'వికాసానికి', ఇండియా కూటమి 'వినాశనానికి' మధ్య జరుగుతున్న పోరుగా బిజెపి అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జెపి నడ్డా పేర్కొన్నారు. భాగస్వామ్య పక్షాలను అంతం చేసే పరాన్నజీవి పార్టీగా కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. లాలూప్రసాద్ యాదవ్ నేతృత్వంలోని ఆర్జెడీ.. రంగ్‌దారీ, జంగల్‌రాజ్, దాదాగిరీలకు ప్రతీక అని విమర్శించారు. బీహార్‌లోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ఈ మేరకు ప్రసంగించారు. తాను పాట్నాలోనే పుట్టానని, బీహార్‌లోనే 20 ఏళ్లు గడిపానని, ఆర్జెడీ చీకటి యుగం గురించి తనకు తెలుసని కేంద్ర మంత్రి నడ్డా పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామని, వలసలను అడ్డుకుంటామని తేజస్వీయాదవ్ ఇచ్చిన హామీలు.. భూమికి ఉద్యోగం కుంభకోణంలో ఆర్జెడీ ప్రమేయాన్ని గుర్తుచేస్తున్నాయన్నారు. మాజీ గ్యాంగ్‌స్టర్ షహాబుద్దీన్ తనయుడు ఒసామాకు రఘునాథ్‌పుర్ నుంచి టికెట్ ఇవ్వడంపై మండిపడ్డారు. బీహార్ విషయంలో ఆ పార్టీకి ఎంత శ్రద్ధ ఉందో ఇది తేటతెల్లం చేస్తోందన్నారు. తేజస్వీ యాదవ్ ఆచరణలో సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని బిజెపి ఎంపి, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు. 2.6 కోట్ల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని తేజస్వీ చెబుతున్నారు. దీనికి రూ.12 లక్షల కోట్లు అవసరం అవుతాయి.

## భారత్‌లో 'జన్‌జెడ్' ఉద్యమాలకు
# ఛాన్స్ తక్కువే!



**న్యూఢిల్లీ,** ఆసియా, ఆఫ్రికాలోని పలు దేశాల్లో జెన్‌జడ్ (1997 -2012 మధ్య పుట్టిన తరం) యువత ప్రభుత్వాలనే కూల్చేస్తుంటే, ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా ఉన్న భారత్‌లో మాత్రం అలాంటి వాతావరణం కనిపించడం లేదు. దేశంలో దాదాపు 37 కోట్ల మంది జెన్ జడ్ యువత ఉన్నప్పటికీ, అవినీతి, నిరుద్యోగం, అసమానతలపై తీవ్ర అసంతృప్తితో ఉన్నా వారు భారీ ఉద్యమాలకు ఎందుకు దూరంగా ఉంటున్నారనే విషయంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల నేపాల్‌లో యువత కేవలం 48 గంటల్లో ప్రభుత్వాన్ని గద్దె దించింది. బంగ్లాదేశ్, ఇండోనేషియా వంటి దేశాల్లోనూ యువతరం ఆందోళనలతో ప్రభుత్వాలు దిగివచ్చిన సంఘటనలు ఉన్నాయి. సోషల్ మీడియా, ఎన్‌క్రిప్టెడ్ యాప్‌ల ద్వారా వేగంగా ఏకమై, అవినీతిపై పోరాడుతూ వారు సంచలనాలు సృష్టిస్తున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న భారత ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. ముఖ్యంగా నేపాల్ పరిణామాల నేపథ్యంలో, ఢిల్లీలో యువత ఆందోళనలు చేపట్టే అవ కాశం ఉందన్న అంచనాలతో పోలీసులు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. భారత్‌లో యువత రోడ్ల మీదకు వచ్చి పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టకపోవడానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. నిపుణుల విశ్లేషణ ప్రకారం, ప్రధాన కారణం వారి మధ్య ఐక్యత లేకపోవడమే. భారత్‌లో యువత కులం, మతం, ప్రాంతం, భాష వంటి గుర్తింపులతో బలంగా ముడిపడి ఉంది. దీంతో వారి సమస్యలు, ఆకాంక్షలు కూడా వేర్వేరుగా ఉంటున్నాయని సెంటర్ ఫర్ యూత్ పాలసీకి చెందిన సుధాంశు కౌశిక్ వివరించారు. ఉదాహరణకు, తమిళనాడులో జల్లికట్టు కోసం, గుజరాత్‌లో రిజర్వేషన్ల కోసం జరిగిన నిరసనలు స్థానిక సమస్యలకే పరిమితమయ్యాయి తప్ప దేశవ్యాప్త ఉద్యమాలుగా మారలేదు. మరోవైపు, నిరసనల్లో పాల్గొంటే దేశ వ్యతిరేకులు అనే ముద్ర వేస్తారనే భయం కూడా యువతను వెనక్కి లాగుతోంది. ఈ రోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే దేశద్రోహిగా చిత్రీకరిస్తున్నారు. ఈ భయంతో చాలామంది మౌనంగా ఉంటున్నారని ఓ పొలిటికల్ సైన్స్ గ్రాడ్యుయేట్ అభిప్రాయపడ్డారు. దీనికి తోడు, ఒకప్పుడు రాజకీయ చర్చలకు కేంద్రంగా ఉన్న యూనివర్సిటీల్లో కూడా ఇప్పుడు నిరసనలపై ఆంక్షలు పెరిగాయి. ఆర్థిక ఒత్తిళ్లు కూడా యువత దృక్పథాన్ని మారుస్తున్నాయి. ఉద్యమాలు చేయడం కంటే మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడటం లేదా విదేశాలకు వలస వెళ్లడంపైనే ఎక్కువ మంది దృష్టి పెడుతున్నారని నిపుణులు చెబుతున్నారు. రాజకీయ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లడం కూడా మరో కారణం. 2024 ఎన్నికల్లో 18 ఏళ్ల వయసున్న వారిలో కేవలం 38శాతం మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవడం దీనికి నిదర్శనం. యువతలో 29శాతం మంది రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఈ కారణాలన్నీ కలిసి, అపారమైన శక్తి ఉన్నప్పటికీ భారత జెన్‌జడ్ ఒకేతాటిపైకి వచ్చి భారీ ఉద్యమాలు చేసే అవకాశాలు ప్రస్తుతానికి తక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అత్యవసర గర్భనిరోధక పిల్స్‌కు జపాన్‌లో ఫ్రీమార్కెట్!

**టోక్యో, అక్టోబరు 24 :** మహిళల ఆరోగ్య హక్కుల విషయంలో జపాన్ ప్రభుత్వం ఒక సంచలననిర్ణయం తీసుకుంది. దేశంలో మొట్టమొదటిసారిగా అత్యవసర గర్భనిరోధక మాత్రలను (మార్నింగ్‌ఆఫ్టర్ పిల్) డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా ఫార్మసీల్లో విక్రయించడానికి అనుమతి ఇచ్చింది. ఈ నిర్ణయం దేశంలోని మహిళల పునరుత్పత్తి ఆరోగ్య హక్కుల సాధనలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ప్రముఖ ఔషధ తయారీ సంస్థ ఆస్కా ఫార్మాస్యూటికల్ తయారు చేస్తున్న 'నార్లెవో' అనే ఈ పిల్ అమ్మకాలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. అయితే, దీనిని గైడెన్స్ అవసరమైన మందుల కేటగిరీలో చేర్చారు. అంటే, ఈ మాత్రను కొనుగోలు చేసే మహిళలు తప్పనిసరిగా ఫార్మసిస్ట్ సమక్షంలోనే దాన్ని తీసుకోవాల్సి ఉంటుంది. కాగా, ఈ పిల్ ఎప్పటి నుంచి మార్కెట్లో అందుబాటులోకి వస్తుందనే తేదీని కంపెనీ ఇంకా ప్రకటించలేదు. ఈ మాత్ర కొనుగోలుకు ఎలాంటి వయోపరిమితి గానీ, తల్లిదండ్రుల అనుమతి గానీ అవసరం లేదని అక్కడి మీడియా కథనాలు స్పష్టం చేశాయి. సురక్షితం కాని లైంగిక చర్య జరిగిన 72 గంటల్లోపు ఈ మాత్రను తీసుకుంటే గర్భం దాల్చకుండా 80 శాతం వరకు నివారించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇది అండం పూర్తిగా అభివృద్ధి చెందకుండా లేదా గర్భాశయానికి అంటుకోకుండా నిరోధిస్తుంది. సంప్రదాయ, పితృస్వామ్య భావజాలం బలంగా ఉన్న జపాన్‌లో మహిళల ఆరోగ్యానికి సంబంధించిన ఔషధాలపై ఆమోదం పొందడం అంత సులభం కాదు. ప్రపంచవ్యాప్తంగా 90కి పైగా దేశాల్లో ఈ తరహా అత్యవసర గర్భనిరోధక మాత్రలు ప్రిస్క్రిప్షన్ లేకుండా లభిస్తున్నప్పటికీ, జపాన్‌లో మాత్రం ఇన్నేళ్లుగా దీనిపై చర్చ జరుగుతూనే ఉంది.

## ఐక్యరాజ్యసమితిలో మరోసారి పాక్ వక్రబుద్ధి!

### ఉగ్రవాదులను స్వాతంత్ర్య సమరయోధులన్న పాక్ ప్రతినిధికి కౌంటర్



**న్యూయార్కు, అక్టోబరు 24 :** అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. భారత్‌పై దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాదులను స్వాతంత్ర్య యోధులుగా చిత్రీకరించి, వారి చర్యలను సమర్థించేందుకు విఫలయత్నం చేసింది. పాక్ కుట్రలను భారత్ తీవ్రంగా తిప్పికొట్టింది. ప్రపంచ ఉగ్రవాదానికి పాకిస్థానే కేంద్ర స్థానమని, దాని ద్వంద్వ నీతి, కపట వైఖరి మరోసారి బట్టబయలయ్యాయని ఐక్యరాజ్యసమితి వేదికగా గట్టిగా నిలదీసింది. సమితి సాధారణ సభలోని మూడో కమిటీ బుధవారం ఉగ్రవాద నిరోధక చర్యలపై చర్చ నిర్వహించింది. ఈ సందర్భంగా పాకిస్థాన్ ప్రతినిధి ముహమ్మద్ జావేద్ అజ్మల్ మాట్లాడుతూ, విదేశీ ఆక్రమణను ఎదిరించే ప్రజల హక్కును, ఉగ్రవాదాన్ని వేరుగా చూడాలని వాదించారు. అంతర్జాతీయ చట్టాలు, సమితితీర్మానం 46/51 కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తప్పుడు వాదనలు వినిపించారు. పాకిస్థాన్ వాదనను భారత ప్రతినిధి, ఫస్ట్ సెక్రటరీ రఘూ పురి తీవ్రంగా ఖండించారు. మానవత్వానికే పెను ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని సమర్థించడం సిగ్గుచేటని అన్నారు. "ఉగ్రవాదం అనేది మానవత్వపు మూలాలపై దాడి చేసే అత్యంత ఘోరమైన నేరం. పాకిస్థాన్ ద్వంద్వ నీతి, కపటత్వం ప్రపంచానికి తెలుసు. ప్రపంచవ్యాప్తంగా జరిగిన ఎన్నో ఉగ్రదాడులతో పాకిస్థాన్‌కు సంబంధాలున్నాయి. అలాంటి దేశం ఉగ్రవాదానికి కేంద్ర స్థానంగా మారింది" అని ఆయన స్పష్టం చేశారు. పాకిస్థాన్ తప్పుగా ఉటంకించిన అంతర్జాతీయ చట్టాల గురించి వివరిస్తూ, ఐరాస ప్రకటన రాజకీయ కారణాలతోభయభ్రాంతులకు గురిచేసే చర్య ఉగ్రవాదమే.

## సంక్షిప్తంగా..

### అమెరికా ఆంక్షలపై రష్యా హెచ్చరిక



**మాస్కో, అక్టోబరు 24 :** ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి తెరదించేందుకుగానూ మాస్కోపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఒత్తిడిని తీవ్రతరం చేశారు. ఈ క్రమంలోనే రష్యాకు చెందిన రెండు అతిపెద్ద చమురు కంపెనీలు రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌పై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయితే.. రష్యా దీన్ని తీవ్రంగా ఖండించింది. ఈ ఆంక్షలు బెడిసికొడతాయని రష్యా విదేశాంగశాఖ ప్రతినిధి మరియా జఖరోవా హెచ్చరించారు. చర్చలు కొనసాగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 'రష్యా చమురు సంస్థలపై అమెరికా విధించిన ఆంక్షలు మాస్కో కన్నా.. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థనే దెబ్బతీస్తాయి. జాతీయ ప్రయోజనాల విషయంలో రష్యాను రాజీ పడేలా చేయడంలో ఇటువంటి చర్యలు సఫలీకృతం కావు. పాశ్చాత్య ఆంక్షలను తట్టుకుని నిలబడే సామర్థ్యాన్ని పెంపొందించుకున్నాం. ఈ విషయంలో పెద్ద అడ్డంకులేమీ లేవు. రాజకీయ దురుద్దేశ ప్రకటనల కన్నా.. దౌత్యమార్గాల ద్వారా జరగాలి.

### హాసనాంబ ఆలయంలో ఐఎఎస్ అధికారిణి నిప్పులపై నడక



**బెంగళూరు, అక్టోబరు 24 :** ఓ ఐఎఎస్ అధికారిణి హాసనాంబ ఆలయంలో నిప్పులపై నడిచి తన భక్తిని చాటుకున్నారు. హాసన్ జిల్లా డిప్యూటీ కమిషనర్ కెఎస్ లతాకుమారి.. ప్రసిద్ధ హాసనాంబ ఆలయంలో జరిగిన అగ్నిగుండం (కెండోత్సవం) కార్యక్రమంలో పాల్గొని, నిప్పులపై నడిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. నిప్పు కణికలపై నడిచినందుకు భక్తుల నుంచి ఆమె ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. హాసనాంబ ఆలయ వార్షికోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలో సంప్రదాయబద్ధంగా 'కెండోత్సవం' నిర్వహించారు. యేడాదిపాటు ఆలయ గర్భగుడిని మూసివేసే ముందు ఈ క్రతువును జరపడం ఆనవాయతీ. ఈ కార్యక్రమంలో డిసి లతాకుమారి స్వయంగా పాల్గొని, కణకణలాడే నిప్పులపై చెప్పులు లేకుండా నడిచారు. ఆమె నిప్పులపై నడుస్తున్నప్పుడు భక్తులు హర్షధ్వానాలు చేశారు.

### 55 యేళ్లుగా వీడని చిన్నారి కిడ్నాప్ మిస్టరీ



**న్యూసౌత్‌వేల్స్, అక్టోబరు 24 :** ఆస్ట్రేలియాలో 55 ఏళ్లుగా మిస్టరీగా మారిన మూడేళ్ల చిన్నారి అదృశ్యం కేసులో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడిగా భావిస్తున్న వ్యక్తిపేరును ఓరాజకీయ నాయకుడు పార్లమెంటులోనే బహిర్గతం చేశారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. 1970 జనవరి 12న వోలోంగాంగ్‌లోని ఫెయిరీ మేడో బీచ్‌లో చెరిల్ గ్రిమ్మర్ (3) అనే చిన్నారి అదృశ్యమైంది.కేసులో మెర్క్యురీ అనే మారుపేరుతో ఉన్న వ్యక్తిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. నేరం జరిగినప్పుడు అతను మైనర్ కావడంతో చట్టపరంగా అతని పేరును గోప్యంగా ఉంచారు. తాజాగా, న్యూసౌత్ వేల్స్ లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు జెరెమీ బకింగ్‌హామ్, తనకున్న ప్రత్యేకాధికారాలను ఉపయోగించి సభలో ఈరోజు నిందితుడి అసలు పేరును వెల్లడించారు. చెరిల్ గ్రిమ్మర్ హత్యపై దర్యాప్తు జరపాలన్నారు.

# రూ.79వేల కోట్ల రక్షణరంగ ప్రతిపాదనలకు ఆమోదం

**న్యూఢిల్లీ, అక్టోబరు 24:** భారత రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రూ.79,000 కోట్ల విలువైన సైనిక పరికరాల కొనుగోళ్లకు అనుమతి ఇచ్చింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ కొనుగోళ్ల మండలి (డిఎసి) సమావేశంలో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలుఆమోదించారు. ఫలితంగా భారత సైన్యం, నావికాదళం, వాయుసేనల యుద్ధ సామర్థ్యాన్ని ఇది గణనీయంగా పెంచేందుకు తోడ్పడుతుంది. ఈ కార్యాచరణతో భారత సైన్యానికి నాగ్ మిస్సైల్ వ్యవస్థ ఎంకె-2 నామిస్, గ్రౌండ్ బేస్డ్ మొబైల్ ఇఎల్ఐఎన్‌టి సిస్టమ్‌లు (నామిస్) అందుబాటులోకి వస్తాయి. నామిస్ శత్రు యుద్ధ వాహనాలు, బంకర్ల వంటి, దుర్భేద్యమైన నిర్మాణాలను సైతం విధ్వంసం చేసే సామర్థ్యం భారత్ కలిగి ఉంటుంది. అంతేకాదు జీబీఎంఇఎస్ 24 గంటల ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్, టాక్టికల్ సమాచార సేకరణకు కూడా ఈ నిధులు సహాయపడతాయి. అలాగే, డైవర్స్ టెరైన్‌లలో లాజిస్టిక్స్ మద్దతును మెరుగుపరచడానికి హైమొబిలిటీ వెహికల్స్ (క్రేన్‌లు) కూడా ఈ కొనుగోళ్ల జాబితాలో చేర్చారు.నావికాదళానికి ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్‌లు (ఎల్పీడీ) 30 మి.మీ. నావల్ సర్ఫేస్ గన్‌ల కొనుగోళ్లకు ఆమోదం లభించింది. ఎల్పీడీలు సైన్యం, వాయుసేనతో కలిసి జాయింట్ అంఫీబియస్ అసాల్ట్ ఆపరేషన్‌లకు, శాంతి స్థాపన, మానవతా సహాయం, విపత్తు నివారణలకు ఇవి ఉపయోగపడతాయి.

ఇక, 30 మి.మీ. గన్‌లు తక్కువ తీవ్రత కలిగిన మారిటైమ్, యాంటీపైరసీ ఆపరేషన్‌లకు సహాయపడతాయి. డిఆర్‌డిఓ నావల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లాబ్ అభివృద్ధి చేసిన అడ్వాన్స్‌డ్ లైట్‌వెయిట్ టార్పెడోలు సాంప్రదాయ, న్యూక్లియర్, మిడ్జెట్ సబ్‌మెరైన్‌లను కూడా అందుబాటులోకి తెచ్చుకోవచ్చు. మరోవైపు, 76 మి.మీ. సూపర్ ర్యాపిడ్ గన్ మోంట్ కోసం స్మార్ట్ అమ్యూనిషన్, ఎలక్ట్రోఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ సెర్చ్ అండ్ ట్రాక్ సిస్టమ్ కూడా మన రక్షణ వ్యవస్థలోకి చేరతాయి.

### దేశరాజధానిలో నలుగురు బీహారీ గ్యాంగ్‌స్టర్ల ఎన్‌కౌంటర్

**న్యూఢిల్లీ, అక్టోబరు 24 :** దేశ రాజధాని ఢిల్లీలో తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పెద్ద కుట్రకు పథకం రచిస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్లను పోలీసులు మట్టుబెట్టారు. ఢిల్లీ, బీహార్ పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. వాయవ్య ఢిల్లీలో తెల్లవారుజామున 2:20 గంటల సమయంలో ఈ కాల్పులు చోటు చేసుకున్నాయి. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఢిల్లీలో తలదాచుకుంటున్న గ్యాంగ్‌స్టర్లను అడ్డుకునేందుకు ప్రయత్నించగా, వారు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే రోహిణిలోని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరణించిన వారిని సిగ్మా గ్యాంగ్‌కు చెందిన రంజన్ పాఠక్ (25), బిమ్లేష్ మహ్తో (25), మనీష్ పాఠక్ (33), అమన్ ఠాకూర్ (21)గా గుర్తించారు.

# పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డేలో ఎస్పీ వినతులు స్వీకరణ



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహించే "పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్ డే" కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని వివిధ విభాగాల పోలీస్ సిబ్బంది వ్యక్తిగత, సర్వీసు, బదిలీ మరియు ఇతర పరిపాలనా సమస్యలపై వినతులను స్వీకరించారు. మొత్తం 8 వినతులను స్వీకరించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులను తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం అత్యంత ప్రాధాన్యత అని తెలిపారు. సిబ్బంది ఎటువంటి భయాలు లేకుండా తమ సమస్యలను నేరుగా ఎస్పీ కార్యాలయంలో అందించవచ్చని స్పష్టం చేశారు. ప్రతి సిబ్బంది విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని, పోలీస్ శాఖ ఒక కుటుంబంలా ఉండి పరస్పరం సహకరించాలని పేర్కొన్నారు.

# జిల్లా స్థాయి క్రీడా పోటీలకు మహాగురుకులం విద్యార్థులు



బ్రహ్మంగారిమఠం ( జర్నలిస్ట్ ఫైల్) బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లి గ్రామం వద్ద గల డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ మహాగురుకులం విద్యార్థులుఈ నెల 22 న బద్వేల్ లో బిజివేముల వీరారెడ్డి ఇండోర్ స్టేడియంలో డివిజనల్ స్థాయి క్రీడాపోటిలలో అండర్ 17విభాగంలో వాలీబాల్ నందు వెంకటయ్య యోగ లో నరసింహ లోహిత్ రంజన్ అండర్ 14విభాగంలో యోగ నందు అఖిల్ డివిజినల్ స్థాయి నుండి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరుడు తెలిపారు. విద్యార్థులను పోటీలకు తీర్చి దిద్దిన వ్యాయామ అధ్యాపకులు రాహుల్, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేష్ నాయక్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ మధు సీనియర్ ఉపాధ్యాయులు పద్మనాభ మూర్తి హిదాయాతుళ్ళ గురు రత్నం ప్రేమ్ కుమార్ ఓబులేసు ఓబులేసు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# హెూంగార్డుకు రిటైర్మెంట్ నజరానా రూ.2.27 లక్షల చెక్కు అందజేత



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): ఉద్యోగ విరమణ పొందిన హెూంగార్డు అగ్నిమళ్ళ వెంకటేశ్వరరావుకు రూ. 2,27,910 చెక్కును జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. వెంకటేశ్వరరావు 44 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో ప్రజలకు అంకితభావంతో సేవలందించారని ఎస్పీ ప్రశంసించారు. "ఇటువంటి నిబద్ధత, సేవాభావం పోలీస్ శాఖకు ఆదర్శప్రాయమైనది. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.

జిల్లాలో పనిచేస్తున్న హెూంగార్డులు తమ ఒకరోజు వేతనం మొత్తాన్ని సేకరించి రూ. 2,27,910 రూపాయల చెక్కును సహెూద్యోగి రిటైర్మెంట్ నజరానాగా అందజేయడం హృదయానికి హత్తుకునే అంశమని ఎస్పీ అభినందించారు. "సహెూద్యోగుల మధ్య ఐకమత్యం, పరస్పర సహకారం స్ఫూర్తిదాయకం. భవిష్యత్తులో కూడా ఇదే భావన కొనసాగాలని ఆశిస్తున్నాను" అని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, హెూంగార్డు ఎన్‌సీఓలు హెడ్ కానిస్టేబుల్ కరిముల్లా, మాణిక్యరావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డిజిటల్ దిశగా మహిళా శక్తి - సమాజ అభివృద్ధికి కొత్త దారి

- గుంటూరులో "డిజిటలైజ్డ్ ఉమెన్" కార్యక్రమంపై ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రశంసలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు మాజేటి కళ్యాణ మండపంలో నిర్వహించిన "డిజిటలైజ్డ్ ఉమెన్" కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యి,ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఈరోజు ఇక్కడ మహిళా శక్తిని చూస్తూ ఎంతో ఆనందంగా ఉంది. ఆశ్లేష గారు ఎంతో వినూత్నమైన ఆలోచనతో డిజిటల్ వేదిక ద్వారా మహిళల ఎంపవర్‌మెంట్‌కి మార్గం సుగమం చేశారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు, మహిళల ఆర్థిక స్వావలంబనకు దారి చూపించే ఒక ఉద్యమం," అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

మహిళల వ్యాపారాలు, నైపుణ్యాలు, సేవలను డిజిటల్ రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లే ఈ కొత్త ప్లాట్‌ఫామ్‌లో వివిధ రంగాల మహిళలు భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

డిజిటల్ ప్రపంచంలో మహిళలు కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, ఇంట్లో నుంచే వ్యాపారాలు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తున్న దేవిరెడ్డి కింద విభిన్న విభాగాల్లో మహిళలు సంఘమిత్రలుగా ముందుకు వస్తుండటం మహిళా శక్తికి నిదర్శనమని అభినందించారు. మహిళా ఎంపవర్‌మెంట్ అంటే ఆర్థిక స్వతంత్రత అనేది ముఖ్యమని, ఈ కార్యక్రమం ఆ దిశగా నడుస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

ఇలాంటి ఆలోచనలు సమాజంలో మహిళా శక్తిని మరింతగా వెలుగులోకి తీసుకోస్తాయని, ఒక మహిళ మరో మహిళకు శక్తిగా నిలబడే వేదికగా 'డిజిటలైజ్డ్ ఉమెన్' మారాలని ఆకాంక్షిస్తున్నానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

# వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి - కమిషనర్ శ్రీనివాసులు

- శివారు ప్రాంతాల్లో కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు నగర శివారు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు.

శుక్రవారం కమిషనర్ కృష్ణబాబు కాలనీ, మునిసిపల్ ఎంప్లాయిస్ కాలనీ, పెద్దపలకలూరు రోడ్, కంకరగుంట ఆర్యూబి తదితర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి తగిన సూచనలు చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ, "గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వకుండా కచ్చా డ్రైన్లు ఏర్పాటు చేయాలి. ఏఈల వారీగా ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఖాళీ స్థలాల్లో నీటిని బెయిల్ అవుట్ చేయాలి. రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చే చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు.

మలేరియా సిబ్బంది సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని యాంటీ మలేరియా కార్యకలాపాలను పిన్ పాయింట్‌గా చేపట్టాలని సూచించారు. అనంతరం కంకరగుంట ఆర్యూబిని పరిశీలించిన కమిషనర్ మాట్లాడుతూ, "ఇటీవల ఏర్పాటు చేసిన అదనపు మోటార్ల వలన వర్షం పడినా తక్కువ సమయంలోనే నీటిని బయటకు పంపించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూస్తున్నాం" అన్నారు.

వర్షాలు ఇంకా రెండు రోజులు కొనసాగే అవకాశం ఉన్నందున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఆర్యూబి పరిసరాలను శుభ్రపరచి, రెయిలింగ్ ఏర్పాటు చేసి, మొక్కలు నాటే చర్యలు తీసుకోవాలని ఈఈలకు ఆదేశించారు. ఈ పర్యటనలో ఈఈలు కోటేశ్వరరావు, వేణు, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి... భారీ 'ఏక్తా యాత్ర'కు ఏర్పాట్లు

- గుంటూరులో బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశం



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో వాజపాయ్ భవన్‌లో జిల్లా పదాధికారుల సమావేశం జరిగింది. రాబోయే కార్యక్రమాలు, సంస్థాగత అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈనెల 31న జరగనున్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా భారీ స్థాయిలో 'ఏక్తా యాత్ర' నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఈ యాత్రలో ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా స్థాయి నాయకులు, కార్యకర్తలతోపాటు ప్రభుత్వ అధికారులూ పాల్గొనేలా చూడాలని చర్చించారు. మండల కేంద్రాల్లో కూడా పటేల్ జయంతి కార్యక్రమాలు చేపట్టే అంశం సమావేశంలో ప్రస్తావించబడింది. తరువాత కర్నూలు సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో మరణించిన వారికి సమావేశంలో శ్రద్ధాంజలి ఘటించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాసరావు, భజరంగ్ రామకృష్ణ, రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, మీడియా ప్యానలిస్టు తాడువాయి రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు సాధు రామకృష్ణ, మంత్రి సుగుణ, వంగిపురం విమలాదేవి, కత్తి మేరీ సరోజినీ, కార్యదర్శి శివయ్య, పటేల్ జయంతి కన్వీనర్ పాండురంగా విటల్, జిల్లా ఇన్‌చార్జిలు గాజుల వెంకయ్య నాయుడు, కొక్కెర శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జి తూనుగుంట్ల రాజేష్, మాజీ ప్రధాన కార్యదర్శులు చరకా కుమార్ గౌడ్, వై.వి. సుబ్బారావు, మండల కార్యకర్తలు అబ్రహాం తదితరులు పాల్గొన్నారు

# అసిస్టెంట్ కమిషనర్‌గా రవికుమార్ సేవలు ఉద్యోగులందరికి ఆదర్శం

- సెంట్రల్ జిఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ శాఖలలో అసిస్టెంట్ కమిషనర్ గా విలువైన సేవలందించిన ఐ.ఆర్.ఎస్ అధికారి బి. రవి కుమార్, విధి నిర్వహణలో ఉద్యోగులందరికి ఆదర్శంగా నిలిచారని సెంట్రల్ జిఎస్టి కమిషనర్ సుజిత్ మల్లిక్ కొనియాడారు. శుక్రవారం ఉదయం లక్ష్మీపురంలోని ఎల్. వి. ఆర్ క్లబ్ ఫంక్షన్ హాలులో జరిగిన రవికుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథి గా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సుజిత్ మల్లిక్ మాట్లాడుతూ... విధి నిర్వహణలో అంకితభావం, నిరంతర శ్రమ, సామర్థ్యంతో రవి కుమార్ పనిచేసి, ఉత్తమ అధికారిగా మంచి గుర్తింపు పొందారన్నారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందించుకొని ఆశయసాధన తో పనిచేయాలని సూచించారు.

జిఎస్టి అడిషనల్ కమిషనర్ బి. లక్ష్మినారాయణ మాట్లాడుతూ.. కృషి, పట్టుదలే సోపానాలుగా రవి కుమార్ మరింతగా ఎదిగారని ప్రశంసించారు. జిఎస్టీ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ మాట్లాడుతూ..విధుల పట్ల విధేయత కలిగిన వారు తప్పక రాణిస్తారన్నారు. పదవీ విరమణ చేయనున్న అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ..కమిషనర్ అందించిన ప్రోత్సహం, ఉద్యోగులందరి సహకారం తోనే తాను అమూల్యమైన సేవలను అందించగలిగానన్నారు. ఉద్యోగ అనుభవాలు వివరించి, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం కమిషనర్ తదితర ఉన్నతధికారులు మరియు ఉద్యోగులు రవికుమార్ ను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందచేసారు. కార్యక్రమంలో గజిటెడ్ అధికారుల సంఘ నాయకులు ఎం.నాగరాజు, కె. యుగంధర్, బి. నవీన్ రాజు మినిస్టీరియల్ సంఘ నేతలు శాఖమూరి శ్రీనివాస్, బిల్లా ప్రశాంత్ కుమార్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు టి. వివేకానంద, గద్దె తిలక్, పి.వి.సత్యనారాయణ, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.కోటేశ్వరరావు, ఎన్. ఎస్. నగేష్ బాబు, కె. సాంబ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

# జీజీహెచ్ లో కార్పొరేట్ వైద్యం



- అన్ని విభాగాలను పటిష్టం చేస్తున్నాం
- వైద్య పరికరాలు, సిబ్బంది కొరతను అధిగమిస్తాం
- జీజీహెచ్ సమీక్ష సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మహర్దశ తీసుకువచ్చామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ లెజిస్లేటివ్, వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వీ రమణతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి విభాగంలో వైద్య పరికరాలు ఎన్ని ఉన్నాయి? వాటి పనితీరు ఎలా ఉంది అనే అంశాలపై ఆరా తీశారు. సిబ్బంది కొరత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏ సమయంలోనైనా మెరుగైన వైద్య సాయం అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జీజీహెచ్ ని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో వైద్య రంగాన్ని నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో వివిధ ఆస్పత్రుల్లో నిరుపయోగంగా ఉన్న వైద్య పరికరాలను జీజీహెచ్ కు తీసుకొచ్చేందుకు చేసిన కృషి ఫలించిందని వెల్లడించారు. దీంతోపాటు ఆపరేషన్ థియేటర్లలో స్టాఫ్ నర్సులు, టెక్నీషియన్ల కొరత ఉన్నట్లు వైద్య అధికారులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దీనిని వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి జిజిహెచ్ లో మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# పోలియోపై అవగాహన



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా తెనాలి నందులపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 1950లో శాస్త్రవేత్త జోనస్ సాల్క్ కిల్డ్ పోలియో వ్యాక్సిన్‌ను, 1961లో ఆల్బర్ట్ సాబిన్ ఓరల్ లైవ్ పోలియో వ్యాక్సిన్‌ను కనుగొన్నారని తెలిపారు. పోలియో అనేది వైరస్ వల్ల కలిగే శిశు పక్షవాతం వ్యాధి అని, దీని వల్ల పిల్లల చేతులు, కాళ్లు పక్షవాతానికి గురవుతాయని వివరించారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ వ్యాక్సిన్‌ను పుట్టినప్పటి నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు షెడ్యూల్ ప్రకారం ఐదు మోతాదులుగా వేయిస్తారని చెప్పారు.

2014 మార్చి 27న భారత్ పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, పక్కదేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్నాయని ప్రియాంక హెచ్చరించారు. "పోలియోకు చికిత్స లేదు, నివారణే మార్గం" అని పేర్కొంటూ తల్లిదండ్రులు తమ పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వ్యాక్సిన్ తప్పక వేయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, ఫార్మసిస్ట్ అరగల శిరీష, స్టాఫ్ నర్స్ సునీత, వార్డ్ హెల్త్ సెక్రటరీలు, ఆరోగ్య మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగన్ రెడ్డి మతిచెడి వెర్రి ప్రేలాపనలా



తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):మాజీముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి లండన్ వెళ్ళొచ్చాక , మతిచెడి, వెర్రి ప్రేలాపనలు చేస్తున్నారని పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్ తమదైన శైలిలో విమర్శలు చేశారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో, పట్టణ పార్టీ అధ్యక్షులు కుద్దూస్ మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ద్వారా విశాఖలో గుగూల్ సంస్థ ఏర్పాటు చేస్తుంటె, డేటా సెంటర్ వల్ల, రాష్ట్రంలోని యువతకు ఏమి ప్రయోజనం లేదని, వైసిపి నాయకులు విమర్శలు చేశారని అన్నారు. లండన్ వెళ్ళొచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్, విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు తాము చేసిన ప్రయత్నమే బీజమని మీడియాకు చెప్పడం విడ్డూరం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పైన కూటమి ప్రభుత్వం పైన, బురదజల్లె వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో ఉన్న కంపెనీలు పక్క రాష్ట్రాలకు వెళ్లే లాగా, వారిని ఇబ్బందులకు గురిచేసిన విషయం మరిచారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటి మంత్రి నారా లోకేష్, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చే విషయంలో, ఐటీ కంపెనీలను తీసుకొచ్చే విషయంలో, అనుకున్న లక్ష్యాలు చేరుకోవడం చూసి,ఓర్వలేక, విపరీత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. పిచ్చి ముదిరిన మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రెస్ మీట్ నిర్వహించి,ఒకగంటా నలభై రెండు నిమిషాలు చేసిన, పొంతన లేని వ్యాఖ్యలు విపరీత పరిణామానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్ మాట్లాడుతూ వైయస్ జగన్ లిక్కర్ మాఫియా గురించి మాట్లాడటం అమానుషమని అన్నారు. లిక్కర్ మాఫియా కి ఆద్యుడు వైయస్ జగన్ అని, జే బ్రాండ్ మధ్యం, విచ్చల విడిగా అమ్మించి, ప్రజల ప్రాణాలతొ చెలగాట మాడిన చరిత్ర మరచి, ఆరోపణలు చేయడం అనైతిక చర్య అన్నారు. ప్రతిపక్ష హెూదా కూడా లేని వైయస్ జగన్మోహన్ రెడ్డి, ప్రజామోదంతొ అధికారం చేపట్టి, అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ విధానంగా ముందుకుసాగుతున్న క్రమంలొ, ఏదో విధంగా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు నమ్మేపరిస్థితి లేదన్నారు. మీడియా సమావేశంలో అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అక్కిశెట్టి వెంకట్రావు, కుదరవల్లి శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్ పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి వసంతం అశోక్ వర్ధన్, పార్టీలోని వివిధ స్థాయి నాయకులున్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ప్రాథమిక ఆర్థిక సూత్రాలే సుస్థిర స్వేచ్ఛకు పునాది

- న్యూఢిల్లీలోని జేఎన్‌యూ ప్రొఫెసర్, ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త ప్రభాత్ పట్నాయక్
- విజ్ఞాన్ యూనివర్సిటీలో ఘనంగా ప్రారంభమైన 'ఉద్భవ్యా' సిరీస్



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) : చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో "ఉద్భవ్యా – ఇగ్నైటింగ్ విజ్డమ్, ఇన్‌స్పైరింగ్ చేంజ్" అనే నూతన కార్యక్రమ సిరీస్‌ను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ అదర్ ఫారిన్ లాంగ్వేజెస్, మరియు ఆఫీస్ ఆఫ్ ది డీన్ –స్టూడెంట్ అఫైర్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ముందుగా, "వాయిస్ ఆఫ్ విజ్డమ్: కన్వర్సేషన్స్ ఫర్ ఎ చేంజింగ్ వరల్డ్" అనే పేరుతో ప్రారంభమైన మొదటి చాప్టర్‌కి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సిరీస్‌లో భాగంగా వివిధ రంగాలకు చెందిన ప్రతిష్ఠాత్మక వ్యక్తులు తమ అనుభవాలు, ఆలోచనలు విద్యార్థులతో పంచుకునే అవకాశం లభించనుంది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రొఫెసర్, ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్త ప్రభాత్ పట్నాయక్ విద్యార్థులకు "ఫ్రీడమ్ ఇన్ ది ఏజ్ ఆఫ్ గ్లోబలైజేషన్" అనే అంశంపై స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసం ఇచ్చారు. "ప్రపంచ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టే ఐదు ప్రాథమిక సూత్రాలు – అభివృద్ధి, సమానత్వం, స్థిరత్వం, సామాజిక భద్రత, ప్రజల భాగస్వామ్యం. ఇవే సుస్థిర ఆర్థిక స్వేచ్ఛకు పునాది కావాలి" అన్నారు. ప్రస్తుత గ్లోబలైజేషన్ యుగంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు మందగమనం దిశగా వెళుతున్నాయని, ఈ పరిస్థితి ఉన్న వ్యవస్థలపైనే సవాలు విసురుతోందని పేర్కొన్నారు. "సంక్షోభం అంటే కేవలం ఆర్థిక క్షీణత కాదు, అది ప్రస్తుత వ్యవస్థను ప్రశ్నించే, మార్పును కోరుకునే దశ" అని వివరించారు. పేదరికాన్ని పూర్తిగా అంతరించజేయడం కష్టమని, ప్రపంచ ఆర్థిక నిర్మాణంలో ఉన్న లోపాల వల్ల అది నిరంతరం పునరుత్పత్తి అవుతూనే ఉంటుందని వివరించారు. గ్లోబలైజేషన్ ప్రభావంలో వ్యక్తిగత స్వేచ్ఛ క్షీణిస్తున్నదని తెలిపారు. "నిజమైన స్వేచ్ఛ అంటే కేవలం రాజకీయ హక్కులు కాదు, ప్రతి వ్యక్తికి ఆర్థిక, సామాజిక, మానసిక స్వతంత్రత కలగడం. ఈ మూడు లేకపోతే స్వేచ్ఛ అసంపూర్ణం అవుతుంది" అని స్పష్టం చేశారు.

గ్లోబలైజేషన్ ప్రపంచాన్ని ఆర్థికంగా ఏకం చేసినప్పటికీ, సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అసమానతలను మరింతగా పెంచిందని అన్నారు. ప్రపంచ సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమవుతుండగా, సాధారణ ప్రజల ఆర్థిక స్వేచ్ఛ రోజురోజుకీ తగ్గిపోతుందన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, గ్లోబల్ మార్కెట్ ఒత్తిడికి లోనుకాకుండా తమ ఆర్థిక విధానాలను రూపొందించుకోవాలని సూచించారు. స్వేచ్ఛ అనేది ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన జీవనోపాధి, విద్య, ఆరోగ్యం, అవకాశాలు లభించే సమాజాన్ని నిర్మించడం ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ జ్ఞానం ఎప్పుడూ పంచుకున్నప్పుడే పెరుగుతుందని, ఒకరితో ఒకరు నేర్చుకోవడం, పరస్పర మేధో మార్పిడి సమాజ అభివృద్ధికి పునాది అవుతుందన్నారు. విద్యార్థులు తమ మేధో పరిపక్వతను పెంపొందించుకోవడం, వ్యక్తిత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అవసరమని సూచించారు.

భవిష్యత్తులో నాయకత్వం వహించాలంటే వినయంతో నేర్చుకోవడం, శ్రద్ధగా వినడం, పరిశీలనతో వ్యవహరించడం అత్యంత కీలకమన్నారు. ఒక మంచి మాట, ఒక స్ఫూర్తిదాయక ఆలోచన మన జీవితాన్ని సరైన దారిలో నడిపించగలదని ప్రేరణాత్మకంగా అన్నారు. తదనంతరం ప్రధాన అతిథిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశైలం భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి




○ ధర్మకర్తల మండలి

శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్ ) : శ్రీశైల దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు భక్తుల సౌకర్యాలను ప్రధానంగా కొనసాగించే విధంగా దృష్టి పెట్టాలని హద్దులా సూచించారు. ఆయన భక్తులు కార్తికమాసంలో ఆలయ దర్శనానికి వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను సమకూర్చాలని, పాతాళగంగలో పుణ్యస్నానాలు సులభంగా జరగేలా, పార్కింగ్ సౌకర్యాలు మెరుగ్గా ఏర్పాటు చేయాలన్నారు. అదనంగా, సామాన్య భక్తులు, వృద్ధులు, చిన్నపిల్లల కోసం మరింత సౌకర్యవంతమైన వసతి, భోజన, దర్శన సదుపాయాలను అందించేందుకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

అలాగే, అక్టోబర్ 31న జరగనున్న కృష్ణమ్మహారతి, నవంబర్ 14న కోటి దీపోత్సవం, నవంబర్ 18న తెప్పోత్సవం వంటి ముఖ్య పుణ్యకార్యక్రమాల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని స్పష్టంగా పేర్కొన్నారు. ప్రతి పుణ్యకార్యక్రమంలో భక్తుల రక్షణ, భద్రత, సమయపాలన, సౌకర్యాల పరిపాలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన హితవు చేశారు.

సమావేశంలో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ఆలయ ఆదాయ–వ్యయాలు, భక్తులకు ఏర్పాటు చేసిన దర్శన, వసతి సదుపాయాలు, మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాధిపతులు, పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది, ఎ.వి. రమణ, బి. రవణమ్మ, జి. లక్ష్మీశ్వరి, కె. కాంతివర్ధిని, శంకరశెట్టి పిచ్చయ్య, జె. రేఖాగౌడ్, ఎ. అనిల్ కుమార్, డి. వెంకటేశ్వర్లు, బి. వెంకటసుబ్బారావు, సిహెచ్. కాశీనాథ్, యం. మురళీధర్, సుబ్బలక్ష్మి, పి.యు. శివమ్మ, జి. శ్రీదేవి మరియు ప్రత్యేక ఆహ్వానితులు కె. నాగమల్లేశ్వరరావు, వి. కోటారెడ్డి, బి. చంద్రమౌళీశ్వరరెడ్డి, కె. సుధాకరరెడ్డి, వి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రైవేటు బస్సుల్లో భద్రత ప్రశ్నార్థకమే

○ కర్నూలులో ప్రైవేటు బస్సు ప్రమాద ఘటన తీవ్ర దిగ్భ్రాంతికరం

○ ఆర్టీసీ సర్వీసులు పెంచేలా AP,TS ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి

○ ఏసి బస్‌ల కంటే నాన్ ఏసి బస్ ల్లో ప్రయాణమే సురక్షితం

○ దేవరపల్లి సురేష్ బాబు ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) : కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ బస్సు ప్రమాదం దుర్ఘటనలో పది మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం,పలువురు క్షతగాత్రులుగా మారటం తీవ్ర దిగ్భ్రాంతికరం. ఈ సంఘటనతో ప్రైవేటు బస్సుల భద్రతపై మరోసారి చర్చనీయాంశంగా,ప్రైవేటు బస్సుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.ప్రయాణికుల మరణాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? బాధిత కుటుంబాలకు ఎవరు సమాధానం చెబుతారు?చాలా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో కేవలం ఒక డ్రైవరు మాత్రమే విధులు నిర్వహిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.డ్రైవర్,క్లీనర్,అసిస్టెంట్ డ్యూటీలు ఒక అతనే నిర్వహించిన సందర్భాలను పలుమార్లు నేను గమనించాను.అదేమని అడిగితే ఈరోజు అసిస్టెంట్ ఎగ్గొట్టాడని సాకులు చెప్పి తప్పించుకుంటున్నారు.

ప్రయాణ రద్దీ అత్యంత ఎక్కువగా ఉండే తెలుగు రాష్ట్రాలలో ఆర్టీసీ సర్వీసులు పెంచేలా ఇరువురు ముఖ్య మంత్రులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.ఘటనలు జరిగినప్పుడు హడావుడి చేసి రెండు రోజుల్లో మర్చిపోయే విధంగా కాకుండా ఇలాంటి అంశాలపై తక్షణ నిర్ణయాలు,చర్యలు తీసుకోవాలి.కావేరి ట్రావెల్స్ బస్సు ఫిట్నెస్ తదితర అంశాలపై పూర్తి విచారణ చేసి అధికారులు,యాజమాన్యం తప్పులు ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**బస్సు డ్రైవర్ లు ఇద్దరి ఆధార్,మొబైల్ నెంబర్ లు**

డ్యూటీ టైం వివరాలు,బస్సు ఫిట్నెస్ వివరాలు ప్రయాణికులకు కనిపించే విధంగా బస్ లో డిస్ప్లేచేయాలి

ఏసి బస్ ల కంటే నాన్ ఏసి బస్సుల్లో ప్రయాణమే సురక్షితం.తప్పనిసరి పరిస్థితుల్లో మినహా నాన్ ఏసి బస్సుల్లో ప్రయణాలకే ప్రాధాన్యత ఇవ్వాలి.మరణించిన ప్రయాణికుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియచేస్తూ క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను.

# సంస్థ పురోభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



○ ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్

విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్ ) : ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ 184 వ బోర్డు సమావేశం గురువారం సాయంత్రం నగరంలోని గాంధీ నగర్ ఏపిహెచ్ డిసి లేపాక్షి కార్యాలయంలో సంస్థ చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ అధ్యక్షతన, వైస్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ ఎం. విశ్వ సమక్షంలో నిర్వహించినట్లు శుక్రవారం తెలిపారు. సమావేశంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి, ప్రోత్సాహం, కళాకారుల సంక్షేమానికి తీసుకుంటున్న, తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన ప్రధాన అంశాలపై చర్చించారు. అదేవిధంగా మార్కెటింగ్ అభివృద్ధి, కళాకారుల ప్రోత్సాహం, సంస్థ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వ్యూహాలను కూడా వారు సమీక్షించారు.

అనంతరం నూతనంగా నియమితులైన డైరెక్టర్లు ఆర్. డివిఎస్. ప్రసాద్, గంగల్ల జీవిత, పొగాకుల సోమశేఖర్, పుట్టం శ్రీనివాసుల రెడ్డి లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు, సమావేశంలో బోర్డు సభ్యులు కూడా పాల్గొన్నారు.

# సర్వీసు ఇనాం భూములపై 45 రోజుల్లో నివేదిక

○ భూ కేటాయింపులపై సమగ్ర విధానం తెస్తాం

○ లీగల్ అడ్డంకులను అధిగమించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

○ వచ్చే జూన్ నాటికి అన్ని టిడ్కో ఇళ్లు పూర్తి

○ మంత్రులు అనగాని, నారాయణ, పార్థసారధి వెల్లడి



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) : సర్వీసు ఇనాం భూముల సమస్యల పరిష్కారానికి సమగ్ర విధానం తేవాలని నిర్ణయించినట్లు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సర్వీసు ఇనాం భూములపై పూర్తి స్థాయి అధ్యయనం కోసం దేవాదాయశాఖ అధికారులు, తాహశీల్దార్లతో కమిటీలు వేస్తున్నామని, ఈ కమిటీలు సమగ్ర అధ్యయనం చేసి 45 రోజుల్లోగా నివేదిక ఇస్తాయని చెప్పారు. ఆ నివేదకను చర్చించి ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయాలు తీసుకొని సర్వీసు ఇనాం భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలో రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశం జరగగా మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, పయ్యావుల కేశవ్, ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు. అనంతరం జరిగిన అందరికీ ఇళ్లు పై ఏర్పాటైన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ సమావేశంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, కె. పార్ధసారధి పాల్గొన్నారు. అనంతరం మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ అనేక పర్యటనలు చేస్తూ రాత్రింబవళ్లు కష్టపడి రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తెస్తున్నారని, ఈ నేపథ్యంలో పరిశ్రమలకు, ఇతర అవసరాలకు భూముల కేటాయింపుపై ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలని నిర్ణయించామని, దీనిపై సమావేశంలో చర్చించామని, త్వరలోనే విధానాన్ని ప్రకటిస్తామని చెప్పారు. ఫ్రీహోల్డ్ భూముల సమస్యపై కూడా చర్చించామని, ఆ భూముల విధానాన్ని మరింత సరళతరం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు చెప్పారు. వక్ఫ్ భూమలపై కూడా సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు. అనంతరం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ 2014-19 కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదలకు ఏడు లక్షల టిడ్కో ఇళ్లను అన్నిసౌకర్యాలతో నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఐదు లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతినిచ్చి గ్రౌండ్ చేస్తే గత వైసీపీ ప్రభుత్వం 2 లక్షల 60 వేలకు కుదించి వాటిని కూడా పూర్తి చేయలేదని చెప్పారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు పేదలకు న్యాయం చేయాలని చెప్పారని, గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకూడదని అన్నారని, మొత్తం రెండు లక్షల 60 వేల టిడ్కో ఇళ్లను వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారని చెప్పారు. అందుకు గాను తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు.

అనంతరం సమాచార, పౌరసరఫరాల సంబంధాలు, హౌసింగ్ శాఖా మంత్రి కె.పార్ధసారధి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచనతో రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళు ,, ఇళ్లస్థలాలు ఇవ్వాలని నిర్ణయించామని చెప్పారు. అర్హులైన వారందరికీ రెండు సెంట్లు, మూడు సెంట్లు స్థలాలు ఎలా ఇవ్వాలో ఈ సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. గత ప్రభుత్వం సెంటు, సెంటున్నర స్థలాలు మాత్రమే ఇచ్చారని అన్నారు. అయితే కొన్ని లేవుట్లలో ఇళ్ల నిర్మాణాలు జరగని చోట లబ్దిదారులను ఒప్పించి వారికి రెండు, మూడు సెంట్లు స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో లీగల్ గా ఉన్న అడ్డంకులను అధిగమించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనుకుంటున్నామని, అందు కోసం అడ్వకేట్ జనరల్ అభిప్రాయం అడుగుతామని, ఆయన తన అభిప్రాయాన్ని ఇవ్వగానే ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి తదుపరి సమావేశంలో ఒక నిర్ణయం తీసుకునే దిశగా ముందుకు వెళు ,న్నామని చెప్పారు. జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కూడా కట్టించి ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పార్ధసారధి చెప్పారు.

# ఎస్ఆర్ఎంలో పరిమళించిన భాష, సాహిత్యం

○ ఘనంగా ముగిసిన అమరావతి సాహిత్య ఉత్సవం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మూడు రోజుల పాటు వివిధ భాషలు, వాటి సాహిత్య పరిమళాలు గుభాళించాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సాహిత్య కోవిదులు, విద్యావేత్తలు, కవులు, కళాకారులతో యూనివర్సిటీ ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ నెల 22న ప్రారంభమైన అమరావతి లిటరేచర్ ఫెస్టివల్ శుక్రవారం సాయంత్రం ఘనంగా ముగిసింది. 22న ప్రఖ్యాత స్త్రీ వాద రచయిత్రి ఓల్గా హాజరై భాష సాహిత్య విలువలపై జరిగిన చర్చావేదికలో కీలక అంశాలను ప్రస్తావించారు. గురు, శుక్రవారాల్లో తెలుగు రచయిత పవన్ సంతోష్, ఆంగ్ల రచయిత కెనాటో జిమ్ లు పాల్గొని ప్రాంతీయ భాషల సంరక్షణ, ప్రాధాన్యతలను వివరించారు. శుక్రవారం ప్రఖ్యాత పబ్లిషర్ మిలీ ఐశ్వర్య పాల్గొని మానవ సమాజానికి ఉపకరించే రచనలపై మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగిన ప్యానల్ డిస్కషన్స్లో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భాషా కోవిదులు, విద్యావేత్తలు ఉత్సాహంగా పాల్గొని అమరావతి సాహిత్య ఉత్సవాన్ని జయప్రదం చేశారు.

**అలరించిన తెలుగు ప్రశస్థి...**

అంతర్జాతీయ కూచిపూడి కళాకారిణి కుమారి కోకా విజయలక్ష్మి బృందం ప్రదర్శించిన తెలుగు ప్రశస్థి నృత్య రూపకం విశేషంగా ఆకట్టుకుంది. తెలుగు భాషా వికాసం, అభివృద్ధి కోసం గౌతమీపుత్ర శాతకర్ణి, శ్రీకృష్ణదేవరాయులు చేసిన కృషిని ప్రస్తుతిస్తూ అమరావతి, భట్టిప్రోలు బౌద్ధ క్షేత్రాల్లో బయల్పడిన శాసనాల చరిత్రను, అందులో పొందుపర్చిన భాష గొప్పదనం గురించి నృత్యరూపకంలో చక్కగా వివరించారు. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం, జానపద నృత్యాలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా యూనివర్సిటీ డీన్ డాక్టర్ జిష్ణుషథ్ కూచిపూడి బృందాన్ని ప్రశంసించారు. కోకా విజయలక్ష్మి, పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మలను సత్కరించారు. అమరావతి కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో తెలుగు ప్రశస్తే ప్రదర్శనకు అవకాశం కల్పించిన నిర్వాహకులకు కుమారి కోకా రిజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

# నిర్మల ఫార్మసీ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం




మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ) : గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (స్వయం ప్రతిపత్తి)లో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల జాతీయ సేవా పథకం మరియు యాంటీ రాగింగ్ సెల్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ హరీష్ కుమార్ గుప్తా, గుంటూరు రేంజ్ ఐజీ ఎస్.ఎస్. త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ నాయకత్వంలో సైబర్ క్రైమ్ అవగాహన బృందం పాల్గొంది.

కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు పెరేడ్‌తో అతిథులను ఆహ్వానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైబర్ నేరాలపై నాటిక ఆకట్టుకుంది. గుంటూరు సైబర్ నిపుణుడు జి. రాజకిశోర్, ఎస్.ఐ. ఎల్. చిరంజీవులు, మహిళా కానిస్టేబుల్ అరుణ విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తలు వివరించారు. "తెలియని లింకులు లేదా మెసేజ్‌లను ఓపెన్ చేయకూడదు, ఓటీపీ లేదా బ్యాంక్ వివరాలు ఎవరికీ ఇవ్వకూడదు, మోసం జరిగితే వెంటనే 1930 నంబరుకు కాల్ చేయాలి లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి" అని సూచించారు.

విద్యార్థులు సైబర్ ప్రపంచంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అవగాహనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. "జాగ్రత్తగా ఉంటేనే సురక్షితమైన డిజిటల్ సమాజం సాధ్యం" అని సందేశమిచ్చారు. కార్యక్రమానికి నిర్మల ఫార్మసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి. పాముల రెడ్డి విచ్చేసి అతిథులను సత్కరించారు. ఇతర విద్యాసంస్థల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ముగింపులో సైబర్ భద్రతపై ప్రతిజ్ఞ చేయడంతో పాటు, పాల్గొన్న విద్యార్థులు మరియు అధ్యాపకులకు జ్ఞాపికలను అందజేశారు.

# నవంబర్ 4 నుంచి 6 వరకు లండన్‌లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పర్యటన



○ వరల్డ్ ట్రావెల్ మార్కెట్ - 2025 సమావేశంలో పాల్గొననున్న మంత్రి దుర్గేష్

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ) : నవంబర్ 4 నుంచి 6 వరకు లండన్ లో జరిగే వం- ల్డ్ ట్రావెల్ మార్కెట్ 2025 సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొనేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పర్యాటక రంగాన్ని వృద్ధి చేయడం, ఇన్ బౌండ్ టూరిజంను మెరుగుపరచడం, రాష్ట్రాన్ని ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నవంబర్ లో మంత్రి కందుల దుర్గేష్ ఈ పర్యటనకు వెళ్లనున్నారు. పర్యటనలో మంత్రి కందుల దుర్గేష్ తో పాటు పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ పాల్గొంటారు.

# ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు గురువారం ఎక్సైజ్ అధికారులతో కలిసి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు మాట్లాడుతూ"నాణ్యమైన మద్యమే వినియోగదారుడికి చేరాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ సరికొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. దుకాణం వద్దే కొనుగోలు చేసిన మద్యం అసలుదనాన్ని వెంటనే చెక్ చేసుకునే వీలు కల్పించే ఈ యాప్ ద్వారా బాటిల్‌పై ఉన్న హాలోగ్రామ్ స్టిక్కర్‌ను స్కాన్ చేస్తే ఆ మద్యం బ్రాండ్, సైజు, ధర, తయారీ సంస్థ, ఏ డిపో నుంచి సప్లై అయ్యిందన్న వివరాలు క్షణాల్లో తెలిసిపోతాయి.

ఒకవేళ "Not Found" లేదా "Invalid Stock" అని వస్తే అది నకిలీ మద్యం అని అర్థం చేసుకోవచ్చు. ఈ వివరాలు వెంటనే ఎక్సైజ్ శాఖ దృష్టికి వెళ్తాయి. ప్రజలు తమ మొబైల్స్‌లో ప్లే స్టోర్ ద్వారా ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సులభంగా వాడుకోవచ్చు. ఈ యాప్ ఎక్సైజ్ శాఖలో పారదర్శకతకు నిదర్శనంగా నిలుస్తుంది" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారు తెలిపారు.

# రోడ్ల నిర్మాణానికి సహకరించండి



○ నందివెలుగు రోడ్డులో చలవట్టు నిర్మాణం అత్యవసరం

○ రోడ్లు, భవనాల శాఖ కమిషనర్‌కు విన్నవించిన ఎమ్మెల్యే నసీర్

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలని రోడ్లు, భవనాల శాఖ కమిషనర్ కృష్ణబాబును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. శుక్రవారం మంగళగిరి సెక్రటేరియట్లో రోడ్లు, భవనాల శాఖ కమిషనర్ కృష్ణబాబుకు ఎమ్మెల్యే నసీర్ వినతిపత్రం అందజేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కల్వర్టులు, రోడ్ల నిర్మాణాలపై నివేదిక సిద్ధం చేశామని వివరించారు. వీటికి తగిన అనుమతులు ఇచ్చి సహకరించాలని కోరారు. నందివెలుగు వెళ్లే రోడ్డులోని జాకీర్ హుస్సేన్ నగర్ వద్ద కల్వర్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని విన్నవించారు. భారీ వర్షాల సమయంలో ఈ కల్వర్టు వద్ద ముంపు కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మణిపురం బ్రిడ్జి మరమ్మత్తులు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే నసీర్ వినతి మేరకు రోడ్లు, భవనాల శాఖ కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

# జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన కలెక్టర్



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) : జ్యూడిషల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం కుమార్ ను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరి మండలం కాజా వద్ద ఉన్న ఏపీ జ్యూడీషియల్ అకాడమీలో శుక్రవారం డైరెక్టర్ ను కలిసి పుష్ప గుచ్చాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, ఏంటీఎంసీ కమిషనర్ ఆలిం భాష పాల్గొన్నారు.

# జాతీయ రహదారి పనులు తనిఖీ చేసిన కలెక్టర్



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో(జర్నలిస్ట్ ఫైల్): జాతీయ రహదారి పనులను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా శుక్రవారం తనిఖీ చేశారు. తాడేపల్లి మండలం కొలనకొండ వద్ద , గుంటూరు తూర్పు మండల పరిధిలోని బుడంపాడు వద్ద జాతీయ రహదారి ఆరు లైన్ల విస్తరణ కోసం నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జాతీయ రహదారికి సంబంధించి అభివృద్ధి , విస్తరణ పనులను, డ్రెయిన్లు నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులను సమన్వయం చేసుకుంటూ జాతీయ రహదారుల అధికారులు డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో ఖాజా టోల్ ప్లాజా వద్ద వాహనదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్ ను, మరుగుదొడ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కాకాని వద్ద గుంటూరు నుంచి వెళ్లే వాహనాలు జాతీయ రహదారి కి అప్రోచ్ రహదారి ఏర్పాటుకు పెండింగ్ లో ఉన్న భూసేకరణ పై జిల్లా కలెక్టర్ రెవెన్యూ అధికారులతో చర్చించి సూచనలు అందించారు. కాజా టోల్ ప్లాజా నుంచి రాజధాని ప్రాంతం మీదుగా గన్నవరం వరకు నేషనల్ హైవే అథారిటీస్ నిర్మిస్తున్న వెస్ట్ బైపాస్ పనులను జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పరిశీలించారు. వర్షం నీరు నిల్వ ఉండకుండా నేషనల్ హైవే అధికారులు, ఎంటీఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్లు నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు.కాజా టోల్ ప్లాజా వద్ద జరుగుతున్న బైపాస్ అప్రోచ్ పనులు, వెంకటపాలెం సమీపంలో కొండవీటి వాగు పై బైపాస్ వంతెన పనుల పురోగతిని జాతీయ రహదారుల అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. వెస్ట్ బైపాస్ పనులు తుది దశకు చేరుకున్నాయని, కాజా టోల్ ప్లాజా వద్ద అప్రోచ్ పనులు, కొన్ని బ్రిడ్జి పనులు పూర్తిచేసి డిసెంబర్ నాటికి ప్రారంభించేందుకు సిద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇప్పటికే విజయవాడ గొల్లపూడి నుంచి వెంకటపాలెం వరకు వాహనాలు వెస్ట్ బైపాస్ పై ప్రయాణిస్తున్నాయన్నారు

తాడేపల్లి సర్వీస్ రోడ్లపై, కుంచనపల్లి సెంటర్ వద్ద, కాజా టోల్ ప్లాజా వద్ద వర్షం నీరు నిల్వ ఉండకుండా నిర్మించాల్సిన డ్రెయిన్ల ప్రతిపాదనలను జాతీయ రహదారుల అధికారులు, ఎంటిఎంసి అధికారులు జిల్లా కలెక్టర్ కు మ్యాపుల ద్వారా వివరించారు. తాడేపల్లి, కాజా వద్ద జాతీయ రహదారి పక్కన నిర్మాణాలు పెరిగిపోవడంతో వర్షం నీరు రహదారిపై నిలిచి పోతుందని అధికారులు తెలిపారు. సర్వీస్ రోడ్డుకు ఇరువైపుల కాలువలు నిర్మించి ప్రత్యేక డ్రెయిన్లు ద్వారా నీటిని సమీపంలోని వాగుల్లోకి మళ్లించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పార్వతీశం, గుంటూరు రెవిన్యూ డివిజన్ అధికారి శ్రీనివాసులు, ఎంటీఎంసీ కమిషనర్ ఆలీమ్ భాష, తహసిల్దార్లు దినేష్ రాఘవేంద్ర, సీతారామయ్య, సుభాని, నేషనల్ హైవే అధికారులు, మున్సిపల్ ఇంజనీర్లు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467